



బాపట్ల: అన్న క్యాంటీన్ దగ్గర ఆహారం కోసం బారులు తీరిన ప్రజానీకం



● బాపట్లలో అన్నక్యాంటీన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళీ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, డీఆర్వో తదితరులు

అన్న క్యాంటీన్లు పునః ప్రారంభమయ్యాయి. ఇంతకాలం ఆకలితో అల్లాడిన పేదల్లో ఆనందం వెల్లివిరిసింది. కడుపు నింపుకునేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయలేక అల్లాడిన పేదలకు అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చే కేంద్రాలుగా దర్శనమిచ్చాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలకు బలైన అన్న క్యాంటీన్లు శుక్రవారం తిరిగి ప్రాణం పోసుకున్నాయి. తక్కువ ధరకు.. నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి ఆ భవనాలను పాడుపెట్టగా పేదలకు చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాటిని పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకే క్యాంటీన్లు ప్రారంభమవగా అల్పాహారం కోసం జనం బారులు తీరారు. భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆరగించి తమ కడుపు నింపారంటూ ఆనందం వ్యక్తం చేశారు. రూ.5కే రుచికరంగా ఆహారం అందించేలా అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న పేదలు

ఆరంభం.. ఆనందం



● చీరాలలో పేదలకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్, డాక్టర్ మహేంద్రనాథ్‌లు



మంగళగిరి: అన్న క్యాంటీన్‌లో అందరితో కలిసి అల్పాహారాన్ని రుచిచూస్తున్న లోకేశ్



● బాపట్ల అన్నక్యాంటీన్ నిర్వహణకు ముప్వా కన్‌స్ట్రక్షన్స్ అధినేత, బ్లూప్లేట్ హోటల్ నిర్వాహకులు ముప్వా వెంకటేశ్వరరావు అందించిన లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ జె.వెంకటమురళికి అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్లు
● పట్టణ కేంద్రాల్లో పండుగలా ప్రారంభోత్సవాలు
● ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే క్యాంటీన్ల పునరుద్ధరణ
● మంగళగిరి, తాడేపల్లిలో క్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్
● తెనాలిలో మనోహర్, రేపల్లెలో అనగాని, అద్దంకిలో గొట్టిపాటి ప్రారంభం

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 16: జిల్లాలోని మున్సిపల్ కేంద్రాల్లో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో పేద ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం పండుగ వాతావరణంలో ఎక్కడికక్కడ అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. నిరుపేదల కడుపు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం సంకల్పించిన అన్న క్యాంటీన్లు ప్రారంభించగా వాటి వద్ద పండుగ వాతావరణం కనిపించింది. రూ.5కే రుచి, శుభ్రతతో కూడిన అల్పాహారం, భోజనం అందుబాటులోకి వచ్చేసరికి పేదలు క్యాంటీన్ల ముందు బారులు తీరారు. చెప్పిన మాట నిలబెట్టుకున్నారని తమ కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందంటూ సీఎం చంద్రబాబును పేదలు ఆశీర్వదించారు. ఐదేళ్ల చిన్నారుల నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు అన్న క్యాంటీన్‌కు వచ్చి ఆకలి తీర్చుకునేందుకు బారులు తీరారు. తొలి రోజు మహిళలు కూడా క్యాంటీన్లకు తరలివచ్చారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు ప్రారంభోత్సవాల్లో పాల్గొని పేదలకు స్వయంగా వడ్డించి అల్పాహారాన్ని రుచి చూశారు. ఇక క్యాంటీన్లు ప్రారంభమైన తొలి రోజు వచ్చిన వారందరికీ కాదనకుండా అల్పాహారం, భోజనం అందజేశారు. గుంటూరు పరిధిలో 7, మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో 3, తెనాలిలో 3, పొన్నూరులో ఒకటి చొప్పున అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించామన్నారు. బాపట్ల జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో, చిలకలూరిపేటలో మూడేసి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, మాచర్ల పట్టణాల్లో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లను తొలివిడతలో ప్రారంభించారు.

వృథాలు లేకుంటే పేదల ఆకలి తీరేది : లోకేశ్

నాడు జగన్‌రెడ్డి వృథా ఖర్చులను తగ్గించుకుని ఉంటే పేదల ఆకలి తీరేదని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరి పాత బస్టాండ్, తాడేపల్లి నులకపేటలో అన్న క్యాంటీన్లను లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ తన ఫొటోలను ముద్రించుకునేందుకు రూ.700 కోట్లను ఖర్చు చేశారన్నారు. విశాఖ రుషికొండపై రూ.500 కోట్ల ఖర్చుతో ప్యాలెస్‌ను నిర్మించారన్నారు. సొంత పత్రిక సాక్షికి రూ.400 కోట్లతో ప్రకటనలు ఇప్పించుకున్నారన్నారు. ఈ వృథా ఖర్చులు పెట్టే కన్నా 203 అన్నక్యాంటీన్ల నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.200 కోట్లను ఖర్చుచేసి ఉంటే లక్షలాదిమంది పేదల ఆకలి తీరేదన్నారు. ఒక్క రుషికొండ ప్యాలెస్‌కు పెట్టిన ఖర్చుతో నిరుపేద కుటుంబాలకు మూడుపూటలా రెండున్నర సంవత్సరాలపాటు భోజనం లభించేదన్నారు. సాక్షికి ఇచ్చిన డబ్బులతో రెండేళ్లపాటు, సర్వేరాళ్లపై ఫొటోలకు వెచ్చించిన డబ్బులతో మూడేళ్లపాటు అన్న క్యాంటీన్లను నడిపించవచ్చని లోకేశ్ వివరించారు. అన్న ఎన్టీఆర్ పేదలే తన దేవుళ్లని నినదించారని, కూటమి పార్టీలు అదే సూక్తిని పాటిస్తాయన్నారు. ఏ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల గురించి ఆలోచిస్తుందో.. ఎవరు పెత్తందారుల గురించి ఆలోచిస్తున్నారో ప్రజలందరూ గుర్తెరగాలని కోరారు. గతంలో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్ల మూసివేయగా తాను కౌన్సిల్‌లో నిలదీయగా నాటి మున్సిపల్ మంత్రి మళ్లీ ప్రారంభిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. తాను ప్రతిపక్షంలో ఉండి నియోజకవర్గంలో నాలుగు ప్రాంతాల్లో సొంత నిధులతో అన్న క్యాంటీన్ల నిర్వహించానన్నారు.

● బాపట్ల సూర్యలంకరోడ్డులోని మీసేవ కేంద్రం పక్కన ఆధునికీకరించిన అన్న క్యాంటీన్ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలతో కలిసి కలెక్టర్ జె.వెంకటమురళి ప్రారంభించారు. భిక్షాటన చేసే వారికి, కార్మికులు, కర్షకులు, పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు రూ.5కే నాణ్యమైన భోజనం గౌరవప్రదంగా అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

● అద్దంకిలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రజలకు స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించి రుచి చూశారు.

● చీరాల హైస్కూల్ రోడ్డులో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ఎం.ఎంకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు.



రేపల్లె: అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్

ఎన్టీఆర్ సంకల్పానికి ప్రతిరూపాలు : మనోహర్

పట్టెడన్నం పెట్టి పేదల ఆకలి తీర్చాలన్న అన్న ఎన్టీఆర్ సంకల్పానికి ప్రతిరూపమే అన్న క్యాంటీన్లని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో శుక్రవారం మూడు చోట్ల అన్న క్యాంటీన్లను ప్రారంభించి ప్రసంగించారు. పేదల ఆకలి తీర్చాలని ఆ నాడే ఎన్టీఆర్ ఆలోచిస్తే, దానిని చంద్రబాబు ఆచరణలో పెట్టారని, ఎందరో పేదలకు అన్న క్యాంటీన్లు కడుపు నింపుతున్నాయన్నారు. రూ.5కే పేదల కడుపు నింపేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా ఆహారం అందిస్తుంటే వైసీపీ ప్రభుత్వం వాటిని మూయించిందన్నారు. పైగా స్వచ్ఛందంగా కొనసాగిస్తున్న క్యాంటీన్లను బలవంతంగా మూతవేయించి వారి పొట్ట కొట్టిందని, ఆ పాపం ఊరికే పోలేదన్నారు. గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు తట్టుకుని 500 రోజులకు పైగా అన్న క్యాంటీన్లను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వహించారన్నారు. పేదల ఆకలి తీర్చేలా అన్న క్యాంటీన్లను రానున్న రోజుల్లో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో మరింతగా ముందుకు తీసుకువెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందనడానికి అన్న క్యాంటీన్ల పునః ప్రారంభమే నిదర్శనమన్నారు. అన్న క్యాంటీన్లకు దాతలుగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు దాతలు రూ.10 లక్షల విరాళాలు అందించడం అభినందనీయమని మాజీ మంత్రి ఆలపాటి కృతజ్ఞతలు తెలిపారు.



తెనాలి: అన్న క్యాంటిన్‌లో అల్పాహారం తీసుకుంటున్న మంత్రి మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్

పేదల ఆకలి తీర్చేందుకు క్యాంటీన్లు : గొట్టిపాటి

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకిలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దుర్మార్గంగా నిలిపివేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందన్నారు. ఈ క్యాంటీన్లలో రూ.15కే మూడు పూటలా నాణ్యమైన టిఫిన్, భోజనం అందిస్తున్నామన్నారు.

● అన్నక్యాంటిన్‌లో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న మంత్రి గొట్టిపాటి



హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు : అనగాని

పేదలు ఎవరూ ఆకలితో అల్లాడ కూడదనే ఉద్దేశంతో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టగానే చంద్రబాబు అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లెలోని అంబేద్కర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా మూసివేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత చేసిన సంతకాల్లో అన్న క్యాంటీన్ అంశం ఒకటన్నారు.రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చెయ్యడానికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, అడ్డదారిలో జగన్ అండ్‌కో వేల కోట్ల రూపాయలు దోచుకుతిన్నారన్నారు.

దాతల విరాళాలు

అన్న క్యాంటీన్లను నిర్విఘ్నంగా కొనసాగించడానికి సీఎం చంద్రబాబు దాతల సహకారాన్ని కోరగా పలువురు స్పందించి విరాళాలు ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్న క్యాంటీన్లు ప్రారంభించిన తొలిరోజునే పెద్దసంఖ్యలో దాతలు విరాళాలు అందజేశారు. చీరాలలో రూ.5.28 లక్షలు, అద్దంకిలో రూ.2 లక్షలు, బాపట్లలో లక్ష, రేపల్లెలో రూ.80,000 వరకు దాతలు విరాళంగా ఇచ్చారు.

● అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారం అందించేందుకు తన బాధ్యతగా జీతంలో నుంచి రూ.25 వేలు అందిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రకటించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన రెండు అన్న క్యాంటీన్లలో ప్రతి శుక్రవారం అయ్యే భోజన ఖర్చు తానే భరిస్తానని ఎమ్మెల్యే నసీర్ ప్రకటించారు. ఒక నెల వేతనం నుంచి రూ.30 వేలను అన్న క్యాంటీన్ ట్రస్ట్‌కి అందిస్తానని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కొల్లి జయరామిరెడ్డి రూ.10,116 చెక్ అందించారు.

● బాపట్లలోని సూర్యలంకరోడ్డులో ప్రారంభించిన అన్నక్యాంటీన్ నిర్వాహణకు ముప్వా కన్‌స్ట్రక్షన్స్ అధినేత, బ్లూప్లేట్ హోటల్ నిర్వాహకులు ముప్వా వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. రేపల్లె మండలం తుమ్మల గ్రామానికి చెందిన రేపల్లె సురేష్ రూ.25 వేలు, రేపల్లెకి చెందిన యలవర్తి లక్ష్మీ రూ.5వేలను అందించారు.

● సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో ఏర్పాటు చేసిన క్యాంటీన్ నిర్వాహణకు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు రూ.50,002 ఇచ్చారు. భవిష్యత్‌లో కూడా క్యాంటీన్‌కు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి రేగళ్ళ కోటిస్వామి రూ.లక్ష, ఎఫ్‌సీఏ విశ్రాంత ఉద్యోగి ఆచంట జనార్ధనరావు రూ.5వేలు ఇచ్చారు. పిడుగురాళ్లలో ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో తొలిరోజు అల్పాహారం, భోజనాలను దాత బండ్ల హనుమంతరావు అందజేశారు. పట్టణానికి చెందిన యక్కల భాస్కరరావు రూ.51 వేలు, కట్టమూరి శంకరరావు రూ.50,116, యేలూరి చంద్రశేఖరరావు రూ.25,116 విరాళంగా అందజేశారు.

లాజిస్టిక్ పార్కుకు భూ పరిశీలన



భవిష్యత్‌లో ఏర్పాటు కానున్న లాజిస్టిక్ పార్కుల నమూనా

● తొలివిడతలోనే రాజధాని ప్రాంతానికి ప్రాధాన్యం
● కేంద్రం ఆమోదంతో భూసేకరణపై అధికారుల దృష్టి
● చంద్రబాబు చొరవతో అమరావతిలో పారిశ్రామిక వృద్ధి

తెనాలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వృద్ధి.. రవాణా వ్యవస్థ బలోపేతం.. ఉపాధి కల్పన దిశగా సీఆర్‌డీఏ ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దేశం మొత్తం మీద 15 నగరాల్లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో తొలివిడతలోనే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతోపాటు ఏపీ రాజధాని అమరావతికి కూడా చోటుదక్కింది. అమరావతిని కీలకమైన ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చాలనే చంద్రబాబు ఆలోచనలో భాగంగా లాజిస్టిక్ పార్కు ఏర్పాటు కానున్నది. ఇందుకు సంబంధించి కేంద్రం ఆమోదం లభించడంతో అధికారులు భూసేకరణపై దృష్టి సారించారు. ఈ పార్కు ఏర్పాటుకు గుంటూరు జిల్లాలో కొన్ని ప్రాంతాలను సీఆర్‌డీఏ ఎంపిక చేసింది. రాజధాని ప్రతిపాదిత ఔటర్ రోడ్డుకు అనుసందానంగా భూములు ఉండేలా చూస్తున్నారనేది సమాచారం. వీటిలో తెనాలి మండలం నందివెలుగు, గుడివాడ, కఠెవరం, చేబ్రోలు మండలంలో గొడవర్రు, నారాకోడూరు, శేకూరు, సుద్దపల్లి, వేజండ్ల, దుగ్గిరాల మండలంలో చింతలపూడి, ఈమని, కొల్లిపర మండలంలో అత్తోట, కుంచవరం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల పరిధిలో భూములను పరిశీలించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం రాజధాని ఔటర్ రోడ్డు ప్రతిపాదిత ప్రాంతంగా సీఆర్‌డీఏ పేర్కొన్న నందివెలుగు ప్రాంతంలో భూములను తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించారు. హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ పార్కును ఏర్పాటు చేయనున్నాయి. ఇదే కనుక జరిగితే రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అభివృద్ధితో పాటు ఆయా ప్రాంతాల వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

లాజిస్టిక్ పార్కు ఏర్పడితే..

పారిశ్రామిక ఏకీకరణ, గిడ్డంగుల ఏర్పాటు, అడ్డంకులు లేని రవాణా వ్యవస్థను సృష్టించటమే లక్ష్యంగా ఏర్పాటయ్యే లాజిస్టిక్ పార్కుతో ఆయా ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. 203 ఎకరాల్లో ఏర్పాటయ్యే పార్కు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1372 కోట్లు కేటాయించింది. దీనిలో రూ.147 కోట్లు భూ సేకరణకు, గోదాముల వంటి స్టోరేజ్ ప్రాంత అభివృద్ధికి రూ.494 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.731 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియ పూర్తిచెయ్యాలనేది సారాంశం. ఈ నెలాఖరుకు భూముల పరిశీలన పూర్తిచేసి, గుర్తించిన భూముల వివరాలను సీఆర్‌డీఏకు అందించాలి. ఆ తర్వాత విడతల వారీగా లాజిస్టిక్ పార్కు ఏర్పాటు సాకారం కానుంది.



నందివెలుగు దగ్గర మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ



శ్రీకృష్ణుడే అవార్డుని తెచ్చాడు

కార్తికేయ 2 చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు గొప్ప విజయం అని ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారం గెలుచుకున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తికేయ 2' మొదలుపెట్టినప్పుడే పెద్ద సినిమా అనుకున్నాం. ఇంత సక్సెస్‌ను ఊహించలేదు. జాతీయ పురస్కారం దక్కడం మా సంస్థకు చాలా గొప్ప విషయం' అన్నారు. ఈ అవార్డునే శ్రీకృష్ణుడే తీసుకొచ్చాడని భావిస్తున్నాను అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నేషనల్ అవార్డ్ మాపై బాధ్యతను మరింత పెంచింది అని చందు మొండేటి తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తను తీస్తున్న 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తను హీరోగా నటించిన 'కార్తికేయ 2' జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని హీరో నిఖిల్ చెప్పారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ - 2 అవార్డు పొందటం సంతోషకరం. ఉత్తమ నటి నిత్యామీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నృత్య దర్శకుడిగా ఎంపికైన జానీ మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు.

- పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

70వ జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు అభినందనలు. ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి, ఉత్తమ నటి నిత్యామేనన్.. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్' , కార్తికేయ 2' మేకర్స్‌కు అలాగే ఇతర పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు

- చిరంజీవి

రిషబ్‌శెట్టికి అభినందనలు. 'కాంతార' చిత్రానికి ఉత్తమ నటుడి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. అందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తివి. 'కాంతార' చిత్రంలో నీ అభినయం గుర్తుకు వస్తే ఇప్పటికీ నాకు గూస్ బంప్స్ వస్తున్నాయి.

- ఎన్టీఆర్

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో.. దుమ్మురేపిన సౌత్ సినిమా

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించగా, ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకు గాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సైతం 'కాంతార' నిలిచింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్(తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్ ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా 'గులెహర్' నిలిచింది. 'పొన్నియిన్ సెల్వన్-1' చిత్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. మలయాళ, తమిళ చిత్రాలకు ఐదు చొప్పున అవార్డులు ప్రకటించగా, కన్నడ సినిమాకు మూడు పురస్కారాలు వచ్చాయి. తెలుగుకు దక్కింది ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఒక్కటే! 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగాను ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

నాలుగోసారి దక్షిణాది హీరోలదే హవా

తొలిగా రిషబ్ శెట్టిని జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం వరించడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ అరుదైన ఘనతను సాధించినట్లైంది. వరుసగా నాలుగుసార్లు దక్షిణాది హీరోలు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2019లో ధనుష్‌కు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలసి ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడి







పురస్కారానికి ఎంపికయ్యారు. 2020లోనూ సూర్య, అజయ్ దేవ్‌గణ్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా') చిత్రానికి గాను సూర్య ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2021లో 'పుష్ప' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇప్పుడు 2022కి గాను రిషబ్‌శెట్టిని ఈ పురస్కారం వరించింది. అంతకు ముందు 2010లో కూడా 'ఆడుకాలం' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి కూడా ఉత్తమ నటుడి పురస్కారానికి దక్షిణాది నుంచి మమ్ముట్టి, రిషబ్ శెట్టి, బాలీవుడ్ నుంచి విక్రాంత్ మాసే (ట్వల్త్ ఫెయిల్) పోటీ పడగా అదృష్టం రిషబ్‌ను వరించింది. మమ్ముట్టి 'నాన్పకల్ నేరట్టు మయక్కం, రోషాక్ రెండు చిత్రాలతో బరిలో నిలిచినా ఫలితం నిరాశపరిచింది.

తెలుగు సినిమాకు అన్యాయం జరిగిందా?



జాతీయ చలనచిత్ర అవార్డులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది తెలుగు సినిమాకు ఉత్తమ జాతీయ నటుడు అవార్డు సహా తొమ్మిది అవార్డులు రావడంతో కాలరు ఎగరేసిన తెలుగు ప్రేక్షకుడు ఈసారి ప్రకటించిన అవార్డుల్లో తెలుగు సినిమాకు ఒక్కటంటే ఒక్క అవార్డ్ కూడా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచనలో పడ్డాడు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత సినిమాలకు ప్రభుత్వ అవార్డులు అన్నవి లేనేలేవు. ఇప్పుడైనా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితి. ఫిల్మ్ ఫేర్ వంటి ప్రైవేట్ అవార్డులను పక్కన పెడితే, సినిమా ప్రముఖులు ఆశించేది, రావాలని కోరుకునేది జాతీయ చలనచిత్ర అవార్డులే. జాతీయ అవార్డ్ పొందితే కెరీర్ పరంగా ఏదో సాధించామనే సంతృప్తి చాలా మందికి ఉంటుంది. అయితే జాతీయ అవార్డు అందుకునే స్థాయి కలిగిన చిత్రాలు తెలుగులో ఎన్ని వస్తున్నాయనేది ఒక ప్రశ్న. తెలుగు చిత్ర పరిశ్రమలో టాలెంట్‌కు కొదువ లేదు. సినీ ప్రపంచమంతా తెలుగు చిత్రపరిశ్రమ వైపే చూస్తున్న రోజులివి. కొత్త తరహాగా ఆలోచించడం, కష్టపడే తత్వం తెలుగు వారికి ఎక్కువ. అయినా సరే కొత్త తరహా చిత్రాల గురించి ఆలోచించకుండా కమర్షియల్ చిత్రాలపై మోజుతో నిర్మాతలు పరుగులు తీస్తున్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. కాకపోతే ఈ ఏడాది ఢిల్లీకి పంపిన చిత్రాల్లో అవార్డుకు అర్హమైనవి కొన్ని ఉండడం వాటికి ఒక్క అవార్డ్ కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది.

కరోనా కారణంగా..

శుక్రవారం ప్రకటించిన నేషనల్ అవార్డ్స్ 2022 సంవత్సరం లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు సంబంధించినవి. వాస్తవానికి 2023 మే 3న ఈ అవార్డులను ప్రదానం చేయాలి. అయితే కరోనా తర్వాత జాతీయ చలన చిత్ర అవార్డుల షెడ్యూల్‌లో మార్పులు జరిగియి. అవార్డుల ఎంపిక, ప్రదాన కార్యక్రమం ఆలస్యమవుతూ వస్తున్నాయి. లోకసభకు జరిగిన ఎన్నికల కారణంగా జాతీయ అవార్డులు ఈసారి మరింత ఆలస్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైనా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని మధ్యలోనే ఆపేసి ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాక మళ్లీ మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రకటించిన అవార్డులను అక్టోబరు నెలలో విజేతలకు అందజేస్తారని సమాచారం.

ఇరవై సినిమాలు... ఒకే ఒక్క అవార్డ్

జాతీయ అవార్డుల కోసం తెలుగు నిర్మాతలు ఈసారి పెద్ద సంఖ్యంలోనే ఎంట్రీలు పంపారు. ఆ జాబితాలో ఉన్న సినిమాలు ఏమిటంటే 1. రైటర్ పద్మభూషణ్, 2. సీతారామం 3. అంటే సుందరానికి.. 4. విరాటపర్వం 5. యశోద 6. రాధేశ్యామ్ 7. సర్కారు వారి పాట 8. మర్రి చెట్టు 9. కుదిరామ్ బోస్ 10. ఇట్లు మారేడుమిల్లి 11. కార్తికేయ 2 12. డీజె టిల్లు 13. ఇక్షూ 14. ధమాకా 15. చదువే నా ఆయుధం 16. బింబిసార 17. భారత పుత్రులు 18. ఎట్ లవ్ 19. అశోకవనంలో అర్జున కల్యాణం 20. అల్లూరి. ఇన్ని సినిమాలు పంపిస్తే వాటిల్లో ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఏ అవార్డూ దక్కలేదు. ఇది ఆలోచించాల్సిన అంశం. 'కార్తికేయ 2' చిత్రానికి ఇచ్చారు కదా అని అంటే అది ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో ఇచ్చిన అవార్డు. ఆ అవార్డు తెలుగు సినిమాకే ఇవ్వాలి కనుక కంటితుడుపు అన్నట్లు 'కార్తికేయ 2'కు ప్రకటించి చేతులు దులుపేసుకుంది అవార్డుల కమిటీ.

ఆ రెండు సినిమాలను పక్కన పెట్టేశారా?

'యుద్ధం రాసిన ప్రేమ లేఖ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకొన్న చిత్రం 'సీతారామం' వైజయంతీ మూవీస్ సంస్థ సగర్వంగా సమర్పించిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించిన సినిమా ఇదని టాలీవుడ్ సెలబ్రేట్ చేసుకుంది. చక్కని కథ, కథనాలతో రూపుదిద్దుకున్న 'సీతారామం'కు జాతీయ అవార్డు ఖాయం అని అందరూ అనుకున్నారు. తీరా శుక్రవారం ప్రకటించిన అవార్డుల జాబితాలో ఆ సినిమా ఊసే లేదు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే 'సీతారామం' చిత్రం చివరి వరకూ పోటీలో ఉంది. అయితే అందులో సుమంత్ పోషించిన పాత్ర పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉందనే సాకుతో అవార్డుల కమిటీ సినిమాను పక్కను పెట్టేసిందట. అలాగే నక్సలైట్లకు అనుకూలంగా, నక్సలిజాన్ని సమర్థించే రీతిలో 'విరాటపర్వం' చిత్రం ఉందంటూ ఆ సినిమాను కూడా పక్కన పెట్టేశారని అంటున్నారు. కల్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రం కూడా కొత్త తరహా ప్రయత్నం. ఆ సినిమాను కూడా అవార్డుల కమిటీ పట్టించుకోలేదు. జ్యూరీలో తెలుగు సభ్యుడు కనీసం ఒకరున్నా తెలుగు సినిమాకు ఇలా అన్యాయం జరిగేది కాదనీ, ఫైట్ చేసి ఏదో ఒక సినిమాకు అవార్డ్ తీసుకువచ్చేవారని అంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సభ్యులు ఎవరూ లేకపోవడంతో . ఇతర భాషల వారు పెత్తనం చెలాయించి, అవార్డుల పరంగా తెలుగు సినిమాకు అన్యాయం చేశారని చిత్ర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి అవార్డులు ఇచ్చారు కానీ..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ముగ్గురికి ఈసారి జాతీయ అవార్డులు రావడం కొంతలో కొంత ఉపశమనం. అయితే వారు అవార్డులు పొందింది తెలుగు చిత్రాలకు కాదు.. తెలుగేతర చిత్రాలకు.

నిత్యా మీనన్‌కు జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ వచ్చింది. అయితే తెలుగు సినిమా కాదు 'తిరుచిత్రంబలం' తమిళ చిత్రం. అలాగే ఎ.ఆర్.రెహమాన్ కూడా తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికే ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డ్ పొందారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కూడా తమిళ సినిమాతోనే జాతీయ అవార్డ్ పొందారు.

70 వ జాతీయ చలనచిత్ర అవార్డులు

- **ఉత్తమ చిత్రం:** 'ఆట్టమ్ (మలయాళం)
- **ఉత్తమ నటుడు:** రిషబ్ శెట్టి (కాంతార- కన్నడం)
- **ఉత్తమ నటి:** నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్- గుజరాతీ)
- **ఉత్తమ దర్శకుడు:** సూరజ్ బర్జాత్యా (ఉంఛాయి- హిందీ)
- **హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్:** కాంతార (కన్నడ)
- **ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్:** బ్రహ్మాస్త్ర పార్ట్ 1 - శివ
- **ఉత్తమ నూతన దర్శకుడు:** ప్రమోద్‌కుమార్- (ఫౌజ- హరియాన్వి)
- **ఉత్తమ సహాయ నటి:** నీనా గుప్తా (ఉంఛా- హిందీ)
- **ఉత్తమ సహాయ నటుడు:** పవన్ రాజ్ మల్హోత్రా- (ఫౌజ)
- **ఉత్తమ బాలనటుడు:** శ్రీపథ్ (మాలికాపురం- మలయాళం)
- **ఉత్తమ ఛాయాగ్రాహకుడు:** రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత:** ఆనంద్ ఏకర్షి(ఆట్టమ్)
- **ఉత్తమ సంభాషణల రచయితలు:** అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టేలా (గుల్ మొహర్)
- **ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు):** ప్రీతమ్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం):** ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ గీత రచయిత:** నౌషాద్ సదర్ ఖాన్-(ఫౌజ)
- **ఉత్తమ నేపథ్య గాయకుడు:** అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర 1 - శివ)
- **ఉత్తమ గాయని:** బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225 -2009)
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం:** (కార్తికేయ 2 - తెలుగు)
- **ప్రత్యేక ప్రశంస:** నటుడు మనోజ్ వాజ్‌పాయ్ (గుల్ మోహర్- హిందీ), సంగీత దర్శకుడు - సంజోయ్ సలీల్ చౌదరి (కదికన్ - మలయాళం)
- **ఉత్తమ ఎడిటర్:** మహేశ్ భువనేండ్ (ఆట్టమ్)
- **ఉత్తమ యాక్షన్ డైరెక్టర్:** అన్బరివు (కేజీఎఫ్ 2'
- **బెస్ట్ బుక్ ఆన్ సినిమా:** కిశోర్‌కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)- రచయితలు- అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
- **బెస్ట్ క్రిటిక్:** దీపక్ దుహ (హిందీ)

గోడకూలి విద్యార్థుల దుర్మరణం

పెదకాకాని లూధరగిరి కాలనీలో విషాదం



బంగారు సిద్ధార్థ (పాతచిత్రం)
కోలాటపు సాత్విక్ (పాతచిత్రం)

పెదకాకాని, ఆగస్టు 16: ఇద్దరు విద్యార్థులను ప్రహరీ మింగేసింది.. వేర్వేరు కుటుంబాలకు చెందిన పిల్లలు మృత్యువాత పడడంతో రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెదకాకానిలోని లూధరగిరి కాలనీలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. కాలనీకి చెందిన బంగారు రాజు, జ్యోతి దంపతుల కుమారుడైన సిద్ధార్థ(13) పెదకాకానిలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కోలాటపు పెద్దదిబ్బయ్య, రత్నకుమారి దంపతుల కుమారుడైన సాత్విక్(12) వెనిగండ్ల జడ్పీ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు. సెలవు దినాలు కావడంతో ఆడుకుంటూ ఇద్దరు సాత్విక్ ఇంటి ముందు ఉన్న ప్రహరీ వద్దకు వచ్చారు. అక్కడ శిథిలావస్థలో ఉన్న ప్రహరీకు పెట్టిన లారీ చెక్కలకు ఆడుకుంటూ వారు తగిలారు. దీంతో లారీ చెక్కలు పక్కకు పడిపోవడంతో గోడ విరుచుకుని సిద్ధార్థ, సాత్విక్‌లపై పడింది. ప్రహరీ కూలి పడటాన్ని చూసిన స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ప్రహరీ కింద ఉన్న ఇద్దర్నీ బయటకు తీసి, వైద్య చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఇరువురు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో పెదకాకాని లూధరగిరికాలనీలోని ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. పెదకాకాని పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణానదిలో దూకి మహిళ గల్లంతు



రమ (పాతచిత్రం)

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16: కృష్ణానదిలోకి దూకి ఓ మహిళ గల్లంతైన సంఘటన తాడేపల్లి పరిధిలోని ప్రకాశం బ్యారేజి వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన రమ అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటనకు పాల్పడినట్టు పోలీసులు తెలియజేశారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గల్లంతైన రమ ఆచూకీ తెలియరాలేదని పోలీసులు తెలిపారు. వివాహిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

20న రాష్ట్ర క్యారమ్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16: ఆంధ్ర స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం డి 2 బ్లాక్‌లో జూనియర్, యూత్ బాల, బాలికల విభాగాల్లో రాష్ట్ర క్యారమ్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగాల్లో 2006, యూత్ విభాగంలో 2003 తరువాత పుట్టినవారు ఈ ఎంపికలకు అర్హులని తెలిపారు. ఎంపికలకు వచ్చే వారు విధిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 99511 15678 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.



ఆసుపత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలి

● గుంటూరులో కదం తొక్కిన జూడాలు ● సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఐఎంఏ, జీడీఏ



గుంటూరులో మానవహారంగా ఏర్పడిన జూడాలు, నిరసనలో గాయపడినట్లు జూడాల వేషధారణ

గుంటూరు(మెడికల్) ఆగస్టు 16: ప్రభుత్వాస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా (సేఫ్ జోన్ ఏరియా) ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆబ్జుడా) డిమాండ్ చేసింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో పీజీ ట్రైనీ విద్యార్థిని హత్యాచారానికి గురవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ జూనియర్ డాక్టర్లు శుక్రవారం గుంటూరులో కదం తొక్కారు. జూడాలకు డెంటల్, ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు తమ సంఘీభావం ప్రకటించి, మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. పలు మహిళా సంఘాలు కూడా జూడాల ఆందోళనకు మద్దతు ప్రకటించాయి. నగరంలో జూనియర్ డాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. నగర కూడళ్లల్లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆబ్జుడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెండ్యాల దీక్షిత్ మాట్లాడుతూ వైద్యులకు రక్షణ కల్పించే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ ఫర్ డాక్టర్స్ చట్టం అమల్లోకి వచ్చేంత వరకు తాము చేపట్టిన నిరవధిక ఆందోళన విరమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ట్రైనీ పీజీ కుటుంబానికి న్యాయం చేయాలని, హంతకులను ఉరి తీయాలని, జూనియర్ డాక్టర్ల రక్షణకు కేంద్రం సీపీఏ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కూడా ఓపీ సేవలు, ఎలెక్టివ్ డ్యూటీస్‌ను బహిష్కరించారు. జూనియర్ డాక్టర్ల గైర్హాజరుతో రోగుల ఇబ్బందులు పడకుండా నివారించేందుకు గుంటూరు వైద్య కళాశాల నుంచి, వైద్య ఆరోగ్య శాఖ నుంచి 50 మంది వైద్యులను డిప్యుటేషన్‌పై తాత్కాలికంగా గుంటూరు జీజీహెచ్‌కు పంపారు. వివిధ ఫార్మసీ కళాశాల నుంచి సుమారు 80 మంది ఫార్మా డీ విద్యార్థులను సైతం ఆసుపత్రి ఓపీ విభాగాల్లో నియమించారు.

నేడు ప్రైవేటు ఆసుపత్రుల మూసివేత

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ట్రైనీ పీజీవిద్యార్థి పాశవిక హత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మహిళా వైద్య విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల పాటు జిల్లాలో అన్ని ప్రైవేటు వైద్యశాలలు మూసివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఐఎంఏ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్, నగర అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తదితరులు మాట్లాడారు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకొనే విధంగా మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను దేశ ప్రజానీకమంతా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. హంతకులకు వెంటనే గుర్తించి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు నిరసనగా ఆగస్టు 18వ తేదీ శనివారం ఉదయం ఆరు గంటల నుంచి 19వ తేదీ ఆదివారం ఉదయం ఆరు వరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులను, క్లినిక్‌లను, నర్సింగ్ హోమ్‌లను మూసివేస్తున్నట్లు వారు తెలిపారు. ఓపీ, ఇతర ఎలెక్టివ్ సేవలు ఉండవన్నారు. కేవలం మానవతా దృక్పథంతో అత్యవసర కేసులకు మాత్రమే చికిత్సలు అందించాలని తీర్మానించినట్లు డాక్టర్ నందకిషోర్ తెలిపారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ, కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీఎస్ హరిత మాట్లాడుతూ ట్రైనీ పీజీ హత్యాచార ఘటన అందరినీ తీవ్రంగా కలచివేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా నగరంలోని వైద్యులందరూ శనివారం ఉదయం 9 గంటలకు నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ బయలుదేరి, శంకర్‌విలాస్, ఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రభుత్వాస్పత్రి వరకు జరుగుతుందన్నారు. విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ప్రతినిధి డాక్టర్ నల్లూరి సుబ్బానాయుడు, జూనియర్ డాక్టర్ల ఆందోళనకు తమ దంత వైద్యుల సంఘం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఈదర కృష్ణమూర్తి, వెలగా మహేష్, తాతా సేవకుమార్, బీ వెంకటేశ్వరరావు, బీటీ అప్పారావు, చేబ్రోలు విశ్వేశ్వరరావు, కోటా సురేష్‌కుమార్, సీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రెవెన్యూశాఖమంత్రి అనగాని సత్యప్రసాద్

పోరాట యోధుడు గౌతు లచ్చన్న

- మంత్రి అనగాని

రేపల్లె, ఆగస్టు 16: అతి చిన్నవయస్సులోనే మహాత్మాగాంధీ పిలుపునందుకుని దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గౌతులచ్చన్న 115వ జయంతి సందర్భంగా బాపట్ల జిల్లా రేపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరతజాతి విముక్తి కోసం అనేక సార్లు అరెస్టయి జైలు జీవితం అనుభవించారన్నారు. రైతాంగ హక్కుల కోసం తడ నుంచి ఇచ్చాపురం వరకు పాదయాత్ర చేసిన మొదటి వ్యక్తి అని ఆయన చెప్పారు. గౌడ కులస్థులకు పితామహుడని ఆయన తెలియజేశారు. లచ్చన్న లాంటిఎందరో నాయకులు పోరాడి సాధించిన హక్కులను ప్రజలకు చెందేలా కృషి చేశారన్నారు. గౌతులచ్చన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరావు, పంతాని మురళీధరరావు, గూడవల్లి బాబు, కొపనాతి రాజశేఖర్, యరగళ్ళ శ్రీనివాసరావు, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, తాతా ఏడుకొండలు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

● రూ.11.04 లక్షల అపరాధ రుసుం

అచ్చంపేట, ఆగస్టు 16 : మండలంలోని అచ్చంపేట సెక్షన్‌లో తాడువాయి, చల్లగరిగ, తాళ్ళచెరువు, కోనూరు, పెదపాలెం, వేల్పూరు, చింతపల్లి, చిగురుపాడు, ఓర్వకల్లు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.11.04 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు కే.సూర్య ప్రకాష్, శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మంది, అక్రమంగా విద్యుత్ వాడుతున్న 17 మంది, అనుమతించిన క్యాటగిరికి కాకుండా ఇతర క్యాటగిరిలో విద్యుత్ వాడుకున్న ముగ్గురికి అదనంగా విద్యుత్ వాడుతున్న 106 మందికి మొత్తంగా రూ.11.04 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయన్నారు. సమావేశంలో డీఈఈ ఎం రవి కుమార్, కే రవి కుమార్, కే రాజశేఖర్, ఏఈ ఏ చంద్రశేఖర్, జీ శివ కోటిరెడ్డి తదితర అధికారులతో పాటు 41 మంది తనిఖీ అధికారులు, 123 మంది సిబ్బంది 41 బృందాలుగా ఏర్పడి 2,416 సర్వీసులను తనిఖీ చేసినట్టు తెలిపారు.

గరీబ్‌రథ్ రైలు చివరి ట్రిప్

● నేడు గుంటూరు మీదగా యశ్వంత్‌పూర్‌కు... రేపు పూరీకి
● సెప్టెంబరు 21 నుంచి ఎల్‌హెచ్‌బీ(భోగీలతో) ప్రయాణం

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దాదాపుగా 12 సంవత్సరాలకు పైగా సేవలందించిన నెంబరు. 22883/22884 పూరీ - యశ్వంత్‌పూర్ - పూరీ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ వయా గుంటూరు రైలు చివరి ట్రిప్ శని, ఆదివారాలలో ముగియనుంది. మొత్తం త్రీటైర్ ఏసీ భోగీలతో రాకపోకలు సాగించే ఈ వీక్లీ రైలులో సైడ కూడా మూడు బెర్తులుంటాయి. దీని వలన ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. కేంద్ర రైల్వేమంత్రిగా లాలుప్రసాద్ యాదవ్ ఉన్నప్పుడు ఈ రైలుని ప్రవేశ పెట్టారు. ఇటీవలకాలంలో ప్రయాణీకుల నుంచి తరచుగా ఫిర్యాదులు వస్తుండటంతో గరీబ్‌రథ్‌ని ఎల్‌హెచ్‌బీ రేక్‌గా మార్చాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకొన్నది. ఆ మేరకు కొన్ని నెలల క్రితమే అడ్వాన్స్ రిజర్వేషన్‌ని సెప్టెంబరు 21వ తేదీ వరకు రద్దు చేసింది. ప్రతీ శుక్రవారం పూరీలో బయలుదేరే ఈ రైలు శనివారం ఉదయం 6 గంటల సమయంలో గుంటూరుకు వచ్చి రాత్రికి యశ్వంత్‌పూర్‌కు చేరుకొంటుంది. అలానే శనివారం రాత్రి యశ్వంత్‌పూర్ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం గుంటూరుకు వచ్చి పూరీకి బయలుదేరి వెళుతుంది. ఇంచుమించు నెల విరామం అనంతరం ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కొత్త రూపురేఖలతో ఈ రైలు సెప్టెంబరు 21 నుంచి గుంటూరు డివిజన్ ప్రయాణీకులకు తిరిగి అందుబాటులోకి రానుంది.



సదస్సును ప్రారంభిస్తున్న మాధవశంకర్

జీవన్ ప్రమాణ్‌తో నిరంతరాయంగా పెన్షన్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16: జీవన్ ప్రమాణ్ దాఖలు చేయడం ద్వారా ఏడాది పాటు నిరంతరాయంగా పెన్షన్ అందుకునే అవకాశం ఉంటుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సహాయక కమిషనర్ జీఆర్‌జేఆర్ మాధవ శంకర్ తెలిపారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై జరిగిన జీవన్ ప్రమాణ్ అవగాహన సదస్సు, విజిలెన్స్ అవగాహన క్యాంపెయిన్ 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ భవిష్యనిధి కమిషనరు రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ అందించే వివిధ పథకాలను సభ్యులందరూ వినియోగించుకోవాలన్నారు. సభలో అతిథిగా పాల్గొన్న దేవస్థానం కమిటీ అధ్యక్షులు సి హెచ్ మస్తానయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎం రామ శేషన్, డి సాయి ఆనంద్ కుమార్, ఎం రామశేషు, అనూష, కే సుధాకర్ రావు, ఎం కృష్ణార్జున్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరమా! ఆందోళన వద్దు!!

అందుబాట్లోకి నూతన వైద్య పరిజ్ఞానం

గుంటూరు (మెడికల్) ఆగస్టు 16: ఉమ్మడి గుంటూరు జిల్లాలో డెంగీ జ్వరాలు వెలుగు చూస్తున్నాయి. డెంగీ బారిన పడి గుంటూరులో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న పలువురు రోగులు కనిపిస్తున్నారు. వీరిలో పలువురు రక్తస్రావం బారిన పడి ఐసీయూ వార్డుల్లో చికిత్సలు పొందటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో పలువురు డెంగీ లక్షణాలతో మృతి చెందినా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం ఇవి డెంగీ మరణాలు కావని బుకాయిస్తోంది. రోగుల సీరం నమూనాలు పరీక్షిస్తే డెంగీ పాజిటివ్‌గా రావడం లేదని వివరిస్తోంది. అయితే కొన్ని కేసుల్లో డెంగీ నిర్ధారణ కాకపోయిన డెంగీ జ్వర లక్షణాలు, రక్తస్రావం కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. వీరికి ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడంతో షాక్ సిండ్రోమ్‌తో మృతి చెందుతున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. గతంలో కన్నా నేడు వైద్య విజ్ఞానం, డాక్టర్ల వైద్య పరిజ్ఞానం బాగా పెరిగింది. ముఖ్యంగా డెంగీ జ్వర చికిత్సల్లో కొత్త అంశాలు తెలియడంతో రోగులకు సురక్షితంగా సమర్థవంతమైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.

ఏపీటీటీ స్థాయిలే కీలకం..

గతంలో డెంగీ రోగుల్లో ప్లేట్‌లెట్లు పాతిక వేలుకు తగ్గితే రక్తస్రావం జరిగి పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని అందరూ భయపడే వారు. అందుకే తరచూ రోగుల్లో ప్లేట్‌లెట్‌ల సంఖ్యను పరీక్షిస్తుండే వారు. నేడు అందుబాట్లోకి వచ్చిన శాస్త్రీయ సమాచారం ప్రకారం రోగుల్లో అంతర్గత రక్తస్రావానికి, ప్లేట్‌లెట్ల సంఖ్యకు అంత సంబంధం లేదని వైద్య వర్గాలు కొత్త విషయం చెబుతున్నాయి. 'డెంగీ రోగుల్లో ప్లేట్‌లెట్‌ల సంఖ్య కంటే 'యాక్టివేటెడ్ పార్షియల్ థ్రాంబోప్లాస్టిన్ టైమ్' (ఏపీటీటీ) అత్యంత కీలకం. ఇది సాధారణ స్థాయిలో ఉంటే ప్లేట్‌లెట్ల సంఖ్య పదివేలకు తగ్గినా భయపడాల్సిన పని లేదు. అదే ఏపీటీటీ స్థాయి పెరిగితే ప్లేట్‌లెట్‌ల సంఖ్య 40 వేలు ఉన్నా రోగుల్లో రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంటుందని' నగరానికి చెందిన ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ స్పెషలిస్ట్ డాక్టర్ రేవూరి హరికృష్ణ తెలిపారు.

రక్తస్రావం నివారణకు ఎఫ్‌పీపీ...

ఏపీటీటీ స్థాయిని బట్టి రోగుల్లో రక్తస్రావం జరిగే విషయాన్ని చాల ముందుగానే తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. ఒకవేళ రోగుల్లో ఏపీటీటీ స్థాయి పెరిగితే, రక్తస్రావం నివారించేందుకు ప్రస్తుతం కొత్తగా ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్‌పీపీ) ఇస్తున్నామని ఆయన తెలిపారు. గతంలో మాదిరిగా ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎఫ్‌పీపీ ఇచ్చిన రోగుల్లో రక్తస్రావం బాగా తగ్గిపోతుందని, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లకుండా సంరక్షించవచ్చని డాక్టర్ రేవూరి హరికృష్ణ తెలిపారు.



క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 15: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం ప్రాజెక్ట్ నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067, ఎడమ కాలువ ద్వారా 7518, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,150, నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా 32,400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 79,535 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 79,535 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 18 వేల క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16: ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరదనీరు వస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 32 వేలు, కీసర వాగు నుంచి మూడు వేల క్యూసెక్కుల వంతున మొత్తం 35 వేల 500 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను ఒక అడుగు వంతున ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17 వేల 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 16: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 49,217 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 57,737 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని తెలిపారు. రెండు గేట్ల ద్వారా ఈ నీరు విడుదలవుతుందన్నారు.

అమెరికా ఫెలోషిప్పులకు ఫొటోగ్రఫీ విద్యార్థుల ఎంపిక

పెదకాకాని, ఆగస్టు 16: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్టుమెంట్ ఆఫ్ జర్నలిజం ఆధ్వర్యంలో ఉన్న డిపార్టుమెంట్ ఆఫ్ ఫొటోగ్రఫీ లో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సును అభ్యసిస్తున్న దామరచర్ల శంకరరావు, గౌరిశెట్టి సురేష్‌బాబులకు ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. అమెరికాలోని ఇమేజ్ కొలీగ్ సొసైటీ వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫెలోషిప్పులకు ఎంపిక చేశారు. శంకరరావు ఉమ్మడి గుంటూరు జిల్లా ఫొటో ఎలైడ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరువురిని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి. అనిత, వర్సిటీ ఫొటోగ్రాఫర్ జి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న టి-10 క్రికెట్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16: టి-10 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17, 19, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారు అక్టోబరులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు 9247111266, 9849448728 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అల్బెండజోల్ మందుల కొరత.. పంపిణీ వాయిదా

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ వాయిదా వేసింది. కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన అల్బెండజోల్ మాత్రలు అందుబాటులో లేనందున వాయిదా వేశారు. సెప్టెంబరు 25వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడా రెండుసార్లు నిర్వమించే నిర్మూలన కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తామన్నారు.

పలువురు అదనపు ఎస్పీలు, సీఐలు బదిలీ

గుంటూరు, ఆగస్టు 16 : జిల్లాలో పలువురు అదనపు ఎస్పీలు, సిఐలను బదిలీ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో అదనపు ఎస్పీలను బదిలీ చేశారు. జిల్లా క్రైమ్స్ అదనపు ఎస్పీ అరిటాకుల శ్రీనివాసరావును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అదనపు డీసీపీగా నియమించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కే ఈశ్వరరావును సీఐడీ విభాగానికి బదిలీ చేశారు. గుంటూరు ఈస్ట్ ఏఎస్పీ నచికేత్ షెల్‌కి విశ్వనాథన్‌ను ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు.

ఈస్ట్ ట్రాఫిక్ సీఐ గా అశోక్‌కుమార్

రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేశారు. పల్నాడు డీసీఆర్బీలో ఉన్న అశోక్ కుమార్‌ను ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్ లో ఉన్న వేణును నెల్లూరు రూరల్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న షేక్ సుభానిని నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న రాజేశ్వరరావును నెల్లూరు జిల్లా కావలి రూరల్ సీఐగా నియమించారు. రేంజి వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును ప్రకాశం జిల్లా పొదిలి రూరల్ సర్కిల్ సీఐగా నియమించారు. ఇంటిలిజెన్స్‌లో ఉన్న మేడా శ్రీనివాస రావును ప్రకాశం జిల్లా ఒంగోలు 2 టౌన్ సీఐగా నియమించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.91 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	102, 110,121
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

46,624 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 39,118 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 46,624 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,864 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	8000	14500
నెంబరు. 5	9500	12000	నెంబరు. 5	9800	12500
273	11000	14500	273	–	–
341	8200	16000	341	10000	13200
4884	11700	11700	4884	11000	16500
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18700	తేజ	10000	18500
బ్యాడిగి	8500	13200	బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	9000	12000	దేవనూరుడీలక్స్	8500	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 16 : బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన సర్దార్‌గౌతులచ్చన్న సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. గౌతులచ్చన్న జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం బాపట్ల కొత్త బస్టాండ్ కూడలిలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. బీసీ సంఘాలు, టీడీపీ బీసీ నాయకులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గౌతులచ్చన్న ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరు ముందుకెళ్ళాలన్నారు. తెలుగుదేశంతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, గౌడ్ సంఘం నాయకులు పరిశా రమేష్‌గౌడ్, మునేశ్వరరావు, తాతా హరిశ్చంద్ర ప్రసాద్, కర్పూరపు రామారావు, కందుల బాలకోటేశ్వరరావు, మరీదు వెంకటేశ్వరరావు, ఉప్పాల మురళీ, ఉప్పాలకృష్ణగౌడ్, సూరగాని మురళీ, టీడీపీ నాయకులు మందపాటి ఆంద్రేయ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, వీరయ్యనాయుడు, పల్లం సరోజనీ, చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, జి.గిరిజారాణి, దగ్గుమల్లి రాణి, మస్తాని, పద్మా, ఇంద్రజ, రజనీ తదితరులు పాల్గొన్నారు.


సర్దార్‌గౌతు లచ్చన్న విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, టీడీపీ నాయకులు

● భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 16 : సర్దార్ గౌతులచ్చన్న జయంతి సందర్భంగా గౌడసంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు అనగాని ఏడుకొండలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి లచ్చన్న చేసిన కృషిని వివరిస్తూ ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆరేపల్లి సుబ్బారావు, యరగళ్ల సాంబయ్య, ఈడీ కార్పొరేషన్ డైరెక్టర్ పడమటి శ్రీనివాసరావు, గాంధీ, వాకా శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, వెంకటనారాయణ, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, ఆగస్టు 16 : గౌతులచ్చన్న ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సీఐ కేసన రవి అన్నారు. గూడవల్లిలో జరిగిన గౌతులచ్చన్న జయంతి వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతులచ్చన్న పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరంకి శివ, మాజీ సర్పంచ్ సాంబశివరావు, గ్రామస్థులు రాయన కృష్ణారావు, కోటేశ్వరరావు, రాంబాబు, సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, ఆగస్టు 16 : మండలంలోని బలిజేపల్లి గ్రామంలో శుక్రవారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లచ్చన్న తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొన్ని పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోగంటి విశ్వం, నిజాంపట్నం సత్యనారాయణ, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, పరిసె సాంబశివరావు పాల్గొన్నారు.


మురుకొండపాడులో గృహాల వెంట నిలిచి ఉన్న మురుగునీరు

పలు గ్రామాలలో సీజనల్ వ్యాధులు

● పారిశుధ్యంపై అధికారులు దృష్టిసారించాలి

బాపట్ల రూరల్, ఆగస్టు 16 : బాపట్ల మండలంలోని పలు గ్రామాలలో వాతావరణంలో వచ్చిన మార్పులు వలన సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో ప్రతి కుటుంబంలో ఒకరు జ్వరాన భారిన పడుతున్నారు. గ్రామంలో చాలా వరకు టైఫాయిడ్, డెంగీ లక్షణాలతో కూడిన జ్వరాలతో బాధపడుతున్నారు. మండలస్థాయి అధికారులు గ్రామాలలో శానిటేషన్ మెరుగు పర్చేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. గతంలో బాపట్ల మండలం మురుకొండపాడు గ్రామంలో మలేరియా జ్వరాన భారీనపడిన సంఘటన జరిగింది. అయితే వర్షాకాలం కావటం, మురుకొండపాడు, కంకటపాలెం గ్రామాలలో డ్రైనేజి వ్యవస్థ లేకపోవటం వల్ల వర్షపునీరు గృహాల వెంట రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలకు నివాస కేంద్రాలుగా మారాయి. సంబంధిత పంచాయతీ అధికారులు వర్షపునీరు, మురుగునీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జ్వరపీడితుల రక్త నమూనా పరీక్షలు చేయాలి

● జిల్లా మలేరియా అధికారి కె.ప్రేమచంద్

బాపట్ల రూరల్, ఆగస్టు 16 : జ్వరపీడితుల రక్తనమూనా పరీక్షలు ఎప్పటికప్పుడు వైద్యాధికారులు నిర్వహిస్తూ ఉండాలని జిల్లా మలేరియా అధికారి కె.ప్రేమచంద్ అన్నారు. బాపట్ల మండలం ముత్తాయపాలెంలో ప్రజలకు డెంగీ లక్షణాలతో కూడిన జ్వరాలు అధికంగా వస్తుండటంతో శుక్రవారం ఆయన గ్రామంలో ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా డెంగీ లక్షణాలతో మృతి చెందిన ముత్తాయపాలెం అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీ భర్త నాగరాజును జరిగిన సంఘటనపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను స్వయంగా పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకు మెడికల్ క్యాంప్‌ను కొనసాగించాలని వైద్యాధికారులకు సూచనలు చేశారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు అధికంగా ఉండటంతో గృహాలు, రహదారుల వెంట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ళ ముందు తొట్టెలలో, రోళ్ళల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు చూచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు గోపి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ముత్తాయపాలెంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న కె.ప్రేమచంద్

బాపట్ల తహసీల్దార్‌గా కుంభా శ్రీదేవి

బాపట్ల, ఆగస్టు 16 : బాపట్ల తహసీల్దార్‌గా కుంభా శ్రీదేవి (ఎఫ్‌ఏసి) శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పి.కృష్ణకాంత్ కేవలం 15 రోజులు మాత్రమే ఇక్కడ పని చేశారు. తన వ్యక్తిగత కారణాల వల్ల పెదకాకాని బదిలీ చేయించుకొని వెళ్ళినట్లు సమాచారం. కాగా 15 రోజులకే బదిలీ కావటం ఏమిటనేది ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న శ్రీదేవిని ఎఫ్‌ఏసీగా నియమించటంతో బాధ్యతలు చేపట్టారు.


కుంభా శ్రీదేవి

వరలక్ష్మిగా శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, 16 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారు భక్తులకు వరలక్ష్మిగా దర్శనమిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని ఖాజీపాలెం, జీఎస్‌పాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, అల్లూరు, అలకాపురం, కోమలి, కోడూరు సంగుపాలెం, భవనంవారిపాలెం, పిట్టువారిపాలెం, కొత్తపాలెం, చందోలు సత్రం తదితర గ్రామాలలో మహిళా భక్తులు శ్రీవరలక్ష్మి వ్రతాలను, పూజలను ఘనంగా నిర్వహించుకున్నారు.


వరలక్ష్మిగా శ్రీబగళాముఖి అమ్మవారు


కలెక్టర్ జె.వెంకటమురళీ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్


రేపల్లెలోని అంబేద్కర్ పార్కు వద్ద అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

అన్నిదానాలలో అన్నదానం మిన్న

● కలెక్టర్ జె.వెంకట మురళి

● ఆర్భాటంగా అన్న క్యాంటీన్ ప్రారంభం

● జిల్లాలో 4 చోట్ల క్యాంటీన్‌లు ప్రారంభం

బాపట్ల, ఆగస్టు 16 : అన్నిదానాలలోకెల్లా అన్నదానం మిన్న అని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. బాపట్ల పట్టణంలోని సూర్యలంకరోడ్డులో మీసేవ కేంద్రం పక్కనే ఆధునీకరించిన అన్న క్యాంటీన్‌లో ఆహారం అందించే కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలతో కలిసి ప్రారంభించారు. పేదలకు రూ.5లకే ఆహారం అందించారు. ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మానవ జీవితంలో ముఖ్యంగా భోజనం, దుస్తులు, నివాసం అవసరమన్నారు. రోడ్డుపై బిక్షాటన చేసే వారికి, కార్మికులు, కర్షకులు, పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు రూ.5లకే నాణ్యమైన భోజనం గౌరవప్రదంగా అందించటం జరుగుతుందన్నారు. జిల్లాలో బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి పట్టణాలలో తొలివిడతగా క్యాంటీన్‌లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

ప్రజాసంక్షేమం కోసం ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన విధంగా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి ప్రారంభించటం అద్భుతమని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పండుగవాతావరణంలో క్యాంటీన్ ప్రారంభించి ప్రజలకు క్వాలిటీ ఆహారం రూ.5లకే అందించటం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్యదినోత్సవం రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక క్యాంటీన్ ప్రారంభించారన్నారు. భవిష్యత్తులో 175 నియోజకవర్గాలలో క్యాంటీన్‌లు ప్రారంభించి ప్రతిరోజు 350మందికి ప్రతిపూట ఆహారం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. పేదవాని ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి ఉదయం టిఫెన్, రెండుపూటల భోజనం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నాక్యాంటీన్‌లు మూసివేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని పునఃప్రారంభించి పేదవాడి ఆకలి తీరుస్తున్నారని చెప్పారు. అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు ప్రతిరోజు రూ.కోటి ఖర్చుఅవుతుంది కావున దాతలు ముందుకొచ్చి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, డీఈ కె.శ్రీనివాసరావు, ఏఈ ఉమామహేశ్వరరావు, ఆర్‌వో సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు అల్లం గోపికృష్ణ, జిట్టా శ్రీనివాసరావు, భీమా లీలా కృష్ణ, మందపాటి ఆంద్రేయ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, ఊట్ల రామారావు, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, కూచిపూడి శ్యామసుందర్, మహిళా నాయకులు పల్లం సరోజనీ, జి.గిరిజారాణి, చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, దగ్గుమల్లి రాణి, బీజేపీ జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీ నారాయణ, పట్టణ బీజేపీ అధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్, చేజర్ల సతీష్, సోమయ్య, బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో ప్రారంభించిన మంత్రి అనగాని

రేపల్లె, ఆగస్టు 16 : పట్టణంలోని అంబేద్కర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. ప్రజలకు భోజనాన్ని వడ్డించి ప్రజల సమక్షంలోనే భోజనం చేసి ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటిన్‌కు రేపల్లె మండలం తుమ్మల గ్రామానికి చెందిన రేపల్లె సురేష్ రూ.25 వేలు అందించారు. పట్టణానికి చెందిన యలవర్తి లక్ష్మి అన్న క్యాంటిన్‌కు రూ.5 వేల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారోన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర రైతు కార్యదర్శి మేకా శివరామకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, గుర్రం మురహరిరావు, మేకా పూర్ణచంద్రరావు, కొమ్మూరి వెంకటేష్, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, డీఎస్పీ మురళీకృష్ణ, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, జీవీ నాగేశ్వరరావు, అనగాని శివప్రసాద్, తాతా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


అన్న క్యాంటిన్‌లో భోజనాన్ని వడ్డిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

పేదవాడి ఆకలి తీర్చిన చంద్రబాబు

పేదవాడి ఆకలిని తీర్చేందుకు చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు అన్న క్యాంటిన్‌లను ఏర్పాటు చేశారని పట్టణ లోని 26వ వార్డుకు చెందిన షేక్ షాహిద్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చకపోగా అన్న క్యాంటిన్‌లను మూసివేసి పేద ప్రజలను రోడ్డున పడేసినట్లు చేసిందన్నారు.


షేక్ షాహిద్

ఆకలిని తీర్చేందుకే అన్నా క్యాంటిన్‌లు దోహదం

ఆర్థిక స్థోమత లేని పేదవారి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌లు మాలాంటి వారి ఆకలిని తీర్చేందుకు దోహదపడ్డాయని పట్టణానికి చెందిన ఏసుబాబు తెలిపారు. ప్రస్తుత తరుణంలో హోటల్‌లో రూ.120లకు భోజనం ఖర్చు అవుతుందని, అన్న క్యాంటిన్‌లో టిఫిన్‌కి రూ.5లు, భోజనం రూ.5లు అందించటం అది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు.

నేడు వైద్యసేవలు బంద్

బాపట్ల,ఆగస్టు 16 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఉదయం 6 గంటలు నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు అన్ని ఆసుపత్రులలో వైద్యసేవలు, ల్యాబ్‌లు బంద్ చేస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీ ప్రసాద్, బాపట్ల బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ హక్, కార్యదర్శి డాక్టర్ మధుసాల్మన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం ఏరియా వైద్యశాల నుంచి పురవీధులలో నిరసన ప్రదర్శన జరుగుతుందన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఓపీ నిలిపివేసి సంఘీభావం తెలియజేస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ తెలిపారు. ఆ తర్వాత సేవలు కొనసాగుతాయన్నారు. ఎమర్జన్సీ సేవలతో పాటు క్యాజువాలటి సేవలు ఎప్పటిలానే కొనసాగుతాయన్నారు.

గిరిజన కుటుంబాలకు ఆహార ప్యాకెట్‌లు పంపిణీ

బాపట్ల,ఆగస్టు 16 : మండలంలోని పూండ్ల గ్రామంలో కాల్వకట్టలపై పూరిపాకలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాల వారికి జేసిఎస్‌ఎంఎం సర్వీస్ ట్రస్ట్ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆహార ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. అనాదిగా నిరుపేదలుగా జీవిస్తున్న గిరిజనులు కాల్వకట్టలపై ఉంటూ శ్రమజీవులుగా జీవనం సాగిస్తున్న వీరికి తమవంతుగా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి సుజాత, కట్టా విజయరాజు, గోపీరాజు తదితరులు పాల్గొన్నారు.

డీజే బాక్స్‌పడి యువకుడు మృతి

బాపట్లరూరల్,ఆగస్టు 16: డీజే బాక్స్‌లు యువకుడిపై పడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాపట్ల సంజీవగాంధీ కాలనీ చెందిన అజయ్‌కుమార్ (28) గురువారం రాత్రి ముత్తాయపాలెంలో నిర్వహించిన తిరునాళ్ళల్లో డిజె బాక్స్‌ల సిస్టమ్ పనికెళ్ళి ప్రమాదవశాత్తు డిజె బాక్స్‌లు అతనిపై పడటంతో మృతి చెందాడు. దీంతో యువకుడి మృతితో సంజీవయ్య గాంధీకాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుని స్నేహితులు, కుటుంబసభ్యులు భారీ ర్యాలీతో అంత్యక్రియలను నిర్వహించారు.

పది ఎకరాల గడ్డి దగ్ధం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 16 : మండలంలోని ఖాజీపాలేనికి చెందిన చెరుకూరి నరసింహారావుకు సంబంధించిన 10 ఎకరాల గడ్డివామి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని శుక్రవారం దగ్ధమైంది. గ్రామ వీఆర్‌ఏ హసీనా బాధితులు, స్థానికులతో కలిసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికి మంటలు అదుపులోకి రాకపోవటంతో పొన్నూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైరింజన్ అక్కడకు చేరుకొని సిబ్బంది గ్రామస్థులతో మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, రూ.లక్ష ఆస్తి నష్టం జరిగి ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేత

పిట్టలవానిపాలెం, ఆగస్టు 16 : మండలంలోని ఖాజీపాలెం గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు చేతిగ్లౌజులు, మాస్, యూనిఫామ్‌లను ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామపెద్దలు, కార్యాలయ సిబ్బందితో ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు వారికి అందజేశారు.

ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఉద్యోగికి సత్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 16 : విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించినందుకు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఉద్యోగిని శుక్రవారం సత్కరించారు. వెల్లటూరు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న బడుగు శివాజీ స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ చైర్మన్, ఎంపీపీ వి.వెంకటలలితకుమారి పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మి, ఫార్మసిస్టు శివకుమారి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


పెరవలిపాలెంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలలో పాల్గొన్న మహిళలు

సామూహిక వరలక్ష్మి వత్రాలు

వేమూరు, ఆగస్టు 16 : మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వత్రాలు నిర్వహించారు. టీటీడీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఈ అమ్మడు మాట్లాడుతూ సకల ఐశ్వర్య ప్రదాయిని అయిన వరలక్ష్మి అమ్మవారిని శ్రావణమాసంలో వ్రత విధానంలో పూజిస్తే సువాసినీల సౌభాగ్యవంతులవుతారని అన్నారు. టీటీడీ సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారకు జంజనం హేమ శంకరరావు, ఆధ్యాత్మిక ప్రచారకు అరుణకుమారి, చవ్వాకుల శాంతకుమారి, గణాది శివ, నాగమణి, దాసరి పరుశురామయ్య, విష్ణుమొలకల శ్రీధర్ తదితరులు పాల్గొని సేవలందించారు.

రేపల్లె, ఆగస్టు 16 : ఎంతో పవిత్రమైన శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో, పలు గృహాల్లో వరలక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం, నల్లూరు శివాలయం, శారదాంబ దేవాలయంలో వరలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు ప్రసాదాలను అందించారు.

శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి గాజులతో అలంకరణ

బాపట్ల, ఆగస్టు 16 : శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని భక్తజనం పెద్దఎత్తున దర్శించుకొని పూజలు నిర్వహించారు.


గాజుల అలంకారంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి 153వ మాను ఉత్సవం

వేమూరు, ఆగస్టు 16 : వేమూరు మండలం జంపని గ్రామంలో ప్రసిద్ధి గాంచిన మహాలక్ష్మి అమ్మవారి 153వ మాను ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు జరిపారు. పలు గ్రామాల భక్తులు గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి పొంగళ్ళు నివేదించారు.

పోలీసుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, ఆగస్టు 16 : పోలీసుల సమస్యలను పరిష్కరించాలంటూ రేపల్లె సర్కిల్ పరిధిలోని పోలీసులు రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందించారు. పలు శాఖల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు ఉద్యోగ సంఘాల నేతలు, ప్రజాసంఘాల నేతలు శుక్రవారం పార్టీ కార్యాలయంలో వినతి పత్రాలను అందించారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులు తమ హక్కులను కాపాడుకునేందుకు ధర్నాలు నిర్వహిస్తే తప్పుడుకేసులు పెట్టారని వాటిని ఎత్తివేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్‌రావు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కె.పున్నారావు, జి.గోకర్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. అరుణశ్రీ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధ్యానం మురళీకృష్ణ వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రాన్ని అందించారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

● పెద్దఎత్తున తరలి వచ్చిన ప్రజానీకం

● బాపట్లలో విశేష స్పందన

బాపట్ల,ఆగస్టు 16 : పేదప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అన్న క్యాంటిన్‌ను బాపట్లలో శుక్రవారం ఆర్భాటంగా ప్రారంభించారు. ప్రారంభం గురించి ముందుగానే తెలుసుకున్న ప్రజానీకం ఉదయం నుంచి క్యాంటీన్ వద్ద బారులు తీరారు. దీంతో ఆప్రాంతం పండుగవాతావరణం నెలకొంది. ఉదయం అల్పాహారం 350 మందికి ఏర్పాటు చేశారు. మూడుఇడ్లీలు, సాంబారు, కారం పొడి లేదా మూడు పూరీలతో కూర రూ.5కే అందజేశారు. మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కూడా 350 మందికి చొప్పున ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఎండతీవ్రతను కూడా లెక్క చేయకుండా ఆహారం కోసం ప్రజానీకం పెద్దఎత్తున బారులు తీరారు. క్యాంటిన్ లోపల నుంచి సూర్యలంకరోడ్డులోని మీసేవ వరకు ప్రజలు నిలబడి టోకెన్‌లు తీసుకొని ఆహారం తిన్నారు. నాణ్యమైన ఆహారం అందించటంపై ప్రజలు పెద్దఎత్తున హర్షం వ్యక్తం చేశారు.


అన్న క్యాంటీన్‌లో వడ్డిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

మువ్వా వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం

బాపట్లలోని సూర్యలంకరోడ్డులో ప్రారంభించిన అన్నక్యాంటీన్ నిర్వహణకు మువ్వా కన్‌స్ట్రక్షన్స్ అధినేత, బ్లూప్లేట్ హోటల్ నిర్వాహకులు మువ్వా వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. మువ్వా జ్యోతిర్మయి జ్ఞాపకార్థంగా అన్నక్యాంటీన్ ట్రస్ట్‌కు ఆయన చెక్కును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ జె.వెంకటమురళికి శుక్రవారం అందజేశారు.

రూ.5లకే అద్భుతమైన ఆహారం

అన్న క్యాంటీన్‌లో రూ.5కే అద్భుతమైన ఆహారం అందించారు. ఇడ్లీ, సాంబారు ఎంతో రుచిగా ఉంది. పూరి కూడా బాగుంది. ఈవిధంగా మంచి ఆహారం రూ.5కే అందించటం ఆనందదాయకం. పేదప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. క్యాంటీన్‌ను ఇదేవిధంగా కొనసాగించాలి.

\- రామ్మూర్తి, చెంగల్రాయుడుతోట


రామ్మూర్తి

మంచి ఆహారం అందిస్తున్నారు

పేద, నిరుపేద ప్రజలకు అన్న క్యాంటీన్ ద్వారా మంచి ఆహారం అందిస్తున్నారు. ఈవిధంగా అల్పాహారంతోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించటం సంతోషదాయకం. క్యాంటీన్ ప్రారంభం కోసం ప్రతిరోజు పేదప్రజలు ఎదురు చూస్తూ ఉన్నారు. ఈరోజు ప్రారంభించి ఆహారం అందించటంపై ప్రతి ఒక్కరం హర్షం వ్యక్తం చేస్తున్నాం.

\- శివ, బాపట్ల


శివ

వంద రోజుల్లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ ప్రసాద్

వేమూరు, ఆగస్టు 16 : జగనన్న లేఅవుట్ల ద్వారా ఇళ్ల స్థలాలు పొంది ఇళ్ల నిర్మాణాలకు ఆమోదాన్ని పొందిన లబ్ధిదారులు 100 రోజుల్లోగా వాటి నిర్మాణాలను పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ జెబిఎస్‌ఆర్‌కెవి ప్రసాద్ అన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వంద రోజుల్లోగా నిర్మాణం పూర్తి చేసిన వారికి మాత్రమే రూ.1,80,000 ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా తక్షణమే రుణం ఇప్పిస్తామన్నారు. ఉపాధి హామీ పథకం కింద గుర్తింపు కార్డు పొందిన వారికి కూలీ వర్తింప చేసే విధంగా సహకరిస్తామన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి విలియమ్స్, హౌసింగ్ డీఈ బి.సీతారామయ్య, ఏఈ సునీల్, ప్రేమ్‌చంద్, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ సుశీల, పంచాయితీరాజ్ ఏఈ మరియదాసు, ఈవోపీఆర్డీ శేఖర్, ఏపీవో సత్యకృష్ణ, ఏపీఎం శోభన్, పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బంది ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్న హౌసింగ్ పీడీ ప్రసాద్

● అమృతలూరు, ఆగస్టు 16 : ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఇంటి నిర్మాణానికి రుణాలు పొందిన వారు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ అసిస్టెంట్స్, ఇతర అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో క్షేత్ర స్థాయిలో శ్లాబ్ వరకు వచ్చి నిలిచిపోయిన 53 ఇంటి నిర్మాణాలను 100 రోజుల్లో వారుపూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ నెహ్రూబాబు, ఎంపీడీవో షేక్ మహబూబ్‌సుబాని, ఏపీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, ఆగస్టు 16 : వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి వై.పిచ్చిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు ఉంటే డ్వాక్రా సంఘ సభ్యులైతే బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి ఆయా గృహాలను పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు, డీపీఎం లక్ష్మీ, ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, హౌసింగ్ ఏఈ సాంబయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో లక్ష్మి, సచివాలయ అసిస్టెంటు ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు న్యాయం చేయడం లేదంటూ రోడ్డెక్కిన తల్లి, కుమారుడు

కొల్లూరు, ఆగస్టు 16 : తమ పొలాన్ని వేరే వ్యక్తులు ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించి వారిపేరున బదలాయించుకున్నారని, ఈ విషయంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తల్లి, కుమారుడు రోడ్డెక్కిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు కథనం ప్రకారం.. పెసర్లంక గ్రామానికి చెందిన అన్నంనేని ముత్తయ్యకు సంబంధించిన ఏడున్నర ఎకరాల భూమిని తెనాలి, పెదరావూరుకు చెందిన వారు 2019లో ఫోర్జరీ చేసి తమ తాత ఆస్తిని వారి పేరున రాయించుకున్నారని, ఈ విషయంపై పోలీసు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని సాతా ప్రసాద్, అతని తల్లి ఆరోపిస్తూ తమకు న్యాయం జరగకపోవడంతో రోడ్డుపై బైఠాయించారు. రోడ్డుపై బైఠాయించిన తల్లి, కుమారుడిని స్టేషన్‌లోకి వచ్చి సమస్య చెప్పాలని కోరగా ప్రసాద్ ఎస్ఐకి జరిగిన విషయాన్ని వివరించారు. దీనిపై పూర్తి సమాచారం తెలుసుకుంటానని రెండు రోజులు వ్యవధి కావాలని కోరగా కౌలురైతు కార్డు జారీ చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని అనడంతో ఆ విషయం మా పరిధి కాదని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. అయినా తల్లి, కొడుకు రోడ్డుపై బైఠాయించడంతో విసిగిపోయిన పోలీసులు వీఆర్వో నుంచి ఫిర్యాదు తీసుకుని తల్లి, కొడుకును అరెస్టు చేశారు.


న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించిన తల్లి, కుమారుడు

జిల్లాలో 906 మంది టీచర్లు మిగులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 16 : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి 906 మంది టీచర్లు మిగులుగా తేలారు. పాఠశాలల్లో ఆగస్టు 8 నాటికి ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా లెక్క తేల్చారు. మిగులు టీచర్ల సంఖ్యలో ఒంగోలు డివిజన్ ప్రథమస్థానంలో ఉండగా మార్కాపురం డివిజన్ చివరి స్థానంలో నిలిచింది. ఒంగోలు మండలంలో అత్యధికంగా 56 మంది టీచర్లు మిగులుగా తేలగా బేస్తవారపేట మండలంలో అతి తక్కువగా కేవలం ఆరుగురు మాత్రమే తేలారు. అర్ధవీడు మండలంలో తొమ్మిది మంది, సీఎస్‌పురం మండలంలో 20 మంది, చీమకుర్తి మండలంలో 33మంది, కంభంలో 31, దర్శిలో 50మంది, దొనకొండ 15, గిద్దలూరులో 13 మంది, హెచ్‌ఎంపాడులో 16 మంది, కనిగిరిలో 49 మంది, కొమరోలులో 8 మంది, కేకేమిట్లలో 33 మంది, కొండపిలో 12 మంది, కొత్తపట్నం 24 మంది, కురిచేడులో 20మంది మిగులుగా తేలారు. మద్దిపాడులో 26 మంది, మార్కాపురంలో 79, మర్రిపూడిలో 22, ఒంగోలులో 56 మంది, ముండ్లమూరులో 25 మంది, ఎన్‌జిపాడులో 14 మంది, పీసీపల్లిలో 23 మంది, పెదదోర్నాలలో 8 మంది, పామూరులో 14 మంది, పెద్దారవీడులో 27 మంది, పొదిలిలో 27 మంది, పొన్నలూరులో 24 మంది, పుల్లలచెరువులో 12 మంది, రాచర్లలో 27మంది, ఎస్‌ఎన్‌పాడులో 33 మంది, సింగరాయకొండలో 20మంది, తాళ్లూరులో 18 మంది, టంగుటూరులో 14 మంది, తర్లుపాడులో 19 మంది, త్రిపురాంతకంలో 26 మంది, వెలిగండ్లలో 7, వైపాలెంలో 23, జరుగుమల్లిలో ఏడుగురు టీచర్లు మిగులుగా తేలారు. తాజాగా ఈనెల 16 వరకు పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని సర్దుబాటు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. దీంతో ఇప్పటివరకు ఏ పాఠశాలలో నమోదు లేని విద్యార్థుల కోసం టీచర్లు జల్లెడపడుతున్నారు. ఒకరిద్దరు విద్యార్థులు తక్కువైన చోట పోస్టులు మిగులుగా తేలుతుంటే వాటిని పోకుండా కాపాడుకోనేందుకు టీచర్లు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే యుడైస్‌లో పేరు ఉన్న విద్యార్థులందరూ భౌతికంగా ప్రతిరోజు పాఠశాలకు రావాల్సిందేనని విద్యాశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో టీచర్ల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో, పోస్టులు పోకుండా ఏ మేరకు కాపాడుకుంటారో వేచిచూడాల్సిందే.

నేడు 93 పాఠశాలలకు ఎన్నికలు

ఒంగోలు(విద్య), ఆగస్టు 16: జిల్లాలోని 93 పాఠశాలల్లో శనివారం యాజమాన్య కమిటీల (ఎస్‌ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 8న జిల్లాలో 2,405 పాఠశాలలకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించగా కోరం లేకపోవడం, కోర్టు ఉత్తర్వులు, ఇతర కారణాలతో 93 పాఠశాలల్లో నిలిచిపోయాయి 2,312 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. నిలిచిపోయిన పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మళ్లీ షెడ్యూల్ ప్రకటించారు. తాజా షెడ్యూల్ ప్రకారం శనివారం పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాలి. ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదట ప్రతి తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ముగ్గురిని సభ్యులుగా ఎన్నుకుంటారు ఎన్నికైన సభ్యులు తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఎన్నికైన ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు, ఎక్స్‌అఫిషియో సభ్యులతో సమావేశం నిర్వహిస్తారు. ఎన్నికలను చేతులెత్తే విధానంలో లేదా నోటిమాటగా నిర్వహిస్తారు. తప్పని పరిస్థితుల్లో రహస్య ఓటింగ్ విధానంలో ఎన్నికను నిర్వహిస్తారు.

ఇద్దరు సీఐలకు పోస్టింగ్

ఐదుగురు ఎస్సైలు వీఆర్‌కు, ఒకరికి అటాచ్‌మెంట్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 16: పోలీసు శాఖలో బదిలీలలో భాగంగా ఇద్దరు సీఐలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు రేంజి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం రేంజి వీఆర్‌లో ఉన్న టి.వెంకటేశ్వర్లను పొదిలి సర్కిల్‌కు, ఇంటెలిజెన్స్‌లో పని చేస్తున్న మేడా శ్రీనివాసరావును ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా జిల్లాలో వీఆర్‌లో ఉన్న బి.మహేంద్రను పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేస్తు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులిచ్చారు. అదేవిధంగా ఐదుగురు ఎస్‌ఐలను వీఆర్‌కు పిలిచారు. పుల్లలచెరువు ఎస్‌ఐ ఎండి.ఫిరోజ్ ఫాతిమా, పొదిలి ఎస్సై గొట్టం కోటయ్య, మార్కాపురం రూరల్ ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు, దర్శి ఎస్‌ఐ ఆర్ .సుమన్, జరుగుమల్లి ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు, పొన్నలూరు ఎస్‌ఐ ఎంవి.రాజేష్‌లను వీఆర్‌కు పిలిచారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానళ్లు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఆగస్టు 16: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేపట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ కార్యాలయం ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ శాఖను సొంత లాభాలకే వాడుకుందని, కొత్తగా ఎలాంటి ఉత్పత్తీ చేపట్టలేదన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సొంత ఇళ్లపైకూడా విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీ ఇస్తుందన్నారు. రాష్ట్రంలో 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేశామని చెప్పారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ శాఖ ద్వారా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. అద్దంకి పట్టణంలో 2 కోట్ల రూపాయల వ్యయంలో 470 విద్యుత్ స్తంభాలకు తీగలు ఏర్పాటు చేయడంతో పాటు కోటి రూపాయలు వ్యయంతో 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశామన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో ముప్పవరం, వి. కొప్పెరపాడు, కొమ్మాలపాడు సబ్ స్టేషన్‌లలో అదనంగా 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం కూడా చేపడుతున్నామన్నారు. అద్దంకి పట్టణంలోని గీతామందిర్ రోడ్డులో షిపా స్పెషాలిటీ హస్పిటల్‌ను మంత్రి రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీచరణ్, టీడీపీ నేతలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్

మార్టూరు, ఆగస్టు16: హెచ్‌ఐవీని సమూలంగా నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నదని, వారికి వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మార్టూరు హెల్ప్‌టీఐ సిబ్బంది చిలకలూరిపేటలో మంత్రి నివాసంలో గొట్టిపాటి రవికుమార్ ను కలిశారు. హెచ్‌ఐవీ నివారణకు ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్న తీరును ప్రతినిధులు ఆయనకు వివరించారు. అనంతరం హెచ్‌ఐవీపైఅవగాహన కోసం ఏర్పాటుచేసిన వాల్‌పోస్టర్‌ను మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, దుర్గ, రూతు, సల్మా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నిండగా...

అన్న క్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్

ఒంగోలు, చీమకుర్తిలలో సంబరంగా కార్యక్రమం

రెండు చోట్ల పాల్గొన్న కలెక్టర్

కడుపు నింపుకొని హర్షం వ్యక్తం చేస్తున్న పేదవర్గాలు



అన్న క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్

ఒంగోలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పేదోడి ఆకలి తీర్చే కేంద్రాలైన అన్నక్యాంటీన్లు తిరిగి ప్రారంభమయ్యాయి. తొలివిడతగా జిల్లాలో ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి శుక్రవారం నుంచి ప్రారంభంకాగా మరో మూడు పట్టణాలలో వచ్చేనెల 1 నుంచి ప్రారంభంకానున్నాయి. పండుగ వాతావరణంలో సంబరంగా క్యాంటీన్లను మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్‌లు ప్రారంభించగా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. గత టీడీపీ ప్రభుత్వకాలంలో తొలిగా అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేసి పేదలకు కేవలం రూ.5కే టిఫిన్, భోజనం అందజేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం కలిపి కేవలం రూ.15కే దొరికేది. దీంతో నిత్యం వందలాది మంది పేదలు వాటిలో భోంచేసేవారు. రుచిశుచి బాగా ఉండటంతోపాటు అతి తక్కువ ధరకు ఆహారం లభించడంతో పేదలకు ఆకలి తీరేది. దీంతో అనతికాలంలోనే విశేషంగా ప్రజాదరణ లభించింది. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసి అప్పటివరకు ఆకలి తీర్చుకున్న పేదల కడుపు కొట్టింది. కాగా తిరిగి అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లు పునరుద్ధరించి పేదల ఆకలి తీర్చుతామని కూటమి తరఫున టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇతర నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆచరణలో పెట్టారు.

జిల్లాలో ఐదు కేంద్రాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలు తిరిగేసరికి మళ్లీ అన్న క్యాంటీన్లు ప్రారంభించింది. తొలివిడతగా రాష్ట్రంలో వంద అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించగా అందులో జిల్లాలో ఐదు క్యాంటీన్లు శుక్రవారం ప్రారంభించారు. గతంలో ఒంగోలులో నాలుగు, చీమకుర్తి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిలలో ఒక్కొక్కటి ఏర్పాటు చేశారు. వాటిని తిరిగి ప్రారంభిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసివేసిన వాటిలో రకరకాల కార్యకలాపాలు నిర్వహించడంతో వాటిని తిరిగి అన్నా క్యాంటీన్లుగా మార్పు చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ రూ.54లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసింది. ఆహ్లాదకరమైన వాతావరణం అన్న క్యాంటీన్లు వద్ద ఉండేలా తీర్చిదిద్దారు. తొలివిడతగా ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి శుక్రవారం నుంచి ప్రారంభం కాగా మిగిలిన మూడు వచ్చేనెల 1 నుంచి ప్రారంభించేలా ఏర్పాటుచేశారు. కాగా శుక్రవారం ఉదయం తొలుత చీమకుర్తిలో అన్న క్యాంటీన్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియాలు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఒంగోలులోని నాలుగు క్యాంటీన్లను మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌లు ప్రారంభించగా ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయకుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

క్యాంటీన్‌లోనే టిఫిన్ చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు

క్యాంటిన్ల ప్రారంభ కార్యక్రమం పండుగ వాతావరణంలో సంబరంగా సాగాయి. మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు పేదలకు వడ్డించడంతోపాటు వారూ టిఫిన్ తిన్నారు. నామమాత్రపు ధరతో పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడంతోపాటు రుచికి శుచికిప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. కాగా అన్న క్యాంటీన్లలో ఆహారం కోసం పేదలు భారీగా తరలివచ్చారు. ఆటో, భవన నిర్మాణ కార్మికులు, మెకానిక్, ఇతర వృత్తులు చేసుకునేవారు బయటి ప్రాంతాల నుంచి ఆస్పత్రులు, కార్యాలయాలకు పనులపై వచ్చిన వారు బారులు తీరి నిలబడి టోకెన్లు తీసుకొని భోజనం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలులోని నాలుగు క్యాంటీన్లలో ఉదయం టిఫిన్ 2,200 మంది, మధ్యాహ్న భోజనం 2వేల మంది చేసినట్లు సమాచారం. చీమకుర్తిలోనూ 500మందికిపైగా తిన్నారు. రెండు పట్టణాలలో భారీగా పేదలు రావడంతో ఆయా క్యాంటీన్ల వద్ద మధ్యాహ్న సమయంలో తీవ్ర రద్దీ వాతావరణం కనిపించింది. ఒంగోలులో సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి అన్న క్యాంటీన్ల ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందజేశారు.

జిల్లాలో భూప్రకంపనలు

రెవెన్యూ రికార్డుల పరిశీలన ప్రారంభం

జిల్లావ్యాప్తంగా లక్షా 30వేల ఎకరాలు హాంఫట్

కనిగిరి డివిజన్‌లోనే 70వేల ఎకరాలను మింగిన వైసీపీ నేతలు

అత్యధికంగా కనిగిరి మండలంలో 25వేలకుపైగా ఎకరాలు

విచారణకు ప్రత్యేక అధికారులు నియామకం



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 16: వైసీపీ ప్రభుత్వంలో చట్టాలను చట్టుబండలు చేసి భూములను కాజేసిన వ్యవహారంపై విచారణ ప్రారంభం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూముల విషయంలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. మదనపల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం తగలబెట్టిన ఉదంతం నేపథ్యంలో జగన్ పాలనలో అక్రమాలు పెద్దఎత్తున జరిగాయని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందులోభాగంగా రాయలసీమ జిల్లాలతోపాటు ప్రకాశం జిల్లాలో కూడా భూములను వైసీపీ సానుభూతిపరులు, ప్రజాప్రతినిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారు. అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూములను దోచుకున్న వారి పని పట్టేందుకు శ్రీకారం చుట్టడంతో వైసీపీ నేతల్లో వణుకు ప్రారంభమైంది. ప్రకాశం జిల్లాలో సుమారు లక్షా 30వేల ఎకరాల భూములను ఆ విధంగా వైసీపీ ప్రభుత్వంలో కాజేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అందులో ఒక్క కనిగిరి డివిజన్‌లోనే సుమారు 70వేల ఎకరాలను అక్రమంగా రికార్డులను తారుమారు చేయగా, అందులో కనిగిరి మండలంలోనే అత్యధికంగా 25వేల ఎకరాల అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు తేల్చారు. అలా కొనకనమిట్ల మండలంలో 11,974 ఎకరాలు, సీఎస్‌పురం మండలంలో 8,900 ఎకరాలు, పుల్లలచెరువు మండలంలో 10వేల ఎకరాలు, మార్కాపురం మండలంలో 3,300 ఎకరాలు, వైపాలెంలో 2,350 ఎకరాల రికార్డులను తారుమారు చేసినట్లు సమాచారం. మిగిలిన మండలాల్లో కూడా ప్రభుత్వ, అసైన్డ్ భూములను రికార్డులను మార్చేసి ఆ భూములను వైసీపీ నేతలు కైంకర్యం చేశారు.

పరిశీలనకు ప్రత్యేక బృందాలు

జిల్లాలోని కనిగిరి మండలపరిధిలో భూపత్రాల పరిశీలన కోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌తోపాటు తహసీల్దార్, సర్వేయర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈ రికార్డులు తనిఖీ చేయనున్నారు. రికార్డుల పునఃపరిశీలన పూర్తిచేసేందుకు మరింత సమయం పడుతుందని అధికారులు గుర్తించినట్లు సమాచారం. కనిగిరి మండలంలో భూ అక్రమాలపై విచారణ పూర్తయిన తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా మిగిలిన మండలాల్లో ఈ తనిఖీలు చేపట్టనున్నారు అందుకోసం ప్రత్యేకంగా ప్రొఫార్మాను రూపొందించి డేటా సేకరణకు సిద్ధం చేయాలని సీసీఎల్‌ఏ ఆదేశించినట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో కొందరు వైసీపీ నేతలు భూముల దందా చిట్టా స్పష్టంగా బయటకు వస్తున్నట్లు తెలిసింది. కాగా వైసీపీ నేతలు తమ భూ అక్రమాల రికార్డులను బయటి సమాజం తెలుసుకోకుండా ఉండేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కనిగిరి ప్రాంతంలో అసైన్డ్, ప్రభుత్వ భూములతోపాటు పట్టాదారు భూముల విషయంలో కూడా పెద్దఎత్తున అక్రమాలు చేశారని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం ముందుగా కనిగిరి మండలంలో ఈ భూముల రికార్డులను తనిఖీకి శ్రీకారం చుట్టడంతో వైసీపీ నేతల్లో ఆందోళన ప్రారంభమైంది.

హీరో నిఖిల్‌కు ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యుల అభినందనలు



హీరో నిఖిల్‌కు స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, కుమారులు

చీరాల, ఆగస్టు 16 : హీరో నిఖిల్ సిద్ధార్థ్‌కు ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, ఆయన కుమారులు గౌరీ అమర్‌నాథ్, మహేంద్రనాథ్‌లు అభినందనలు తెలిపారు. శుక్రవారం 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో జాతీయ ఉత్తమ తెలుగు చలనచిత్రంగా కార్తికేయ -2కు అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో హీరో నిఖిల్ మామ చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, నిఖిల్ బావ గౌరీఅమర్‌నాథ్, బావమరిది టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌లు నిఖిల్‌ను అభినందించారు. గత ఎన్నికలలో కూటమి అభ్యర్థులుగా చీరాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఎం.ఎం కొండయ్య ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ల గెలుపు ఓట్లు ద్వారా ఆశీర్వదించాలని నిఖిల్ చీరాల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా సందర్భాల్లో చీరాల నియోజకవర్గంలోని యువత పెద్ద ఎత్తుల నిఖిల్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో కార్తికేయ- 2కు అవార్డు రావటం పట్ల ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత

మేదరమెట్ల, ఆగస్టు 16: దైవాలరావూరు ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు ఉపకార వేతనాలు కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్ గ్రామస్థుల ద్వారా అందజేశారు. పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి 5 వేలు, ద్వితీయస్థానం 3వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ. 2 వేలు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నగదును విద్యార్థులకు అందజేశారు.

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు!

కొండపిలో 260 మందికి ఇళ్ల పట్టాలు

ఊరికి దూరంగా ఉండటంతో ఆసక్తి చూపని లబ్ధిదారులు

గృహం నిర్మించింది ఒక్కరే ప్రారంభించి మధ్యలోనే నిలిపేసిన 20 మంది

నిర్మాణ సామగ్రి దొంగలపాలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో తీగ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌లోని తీగను దొంగిలించి వదిలేసిన ట్రాన్స్‌ఫార్మర్

కొండపి, ఆగస్టు 16 : కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పేరుతో హడావుడి చేసింది. అయితే ఊరూరా వెలిసిన జగనన్న కాలనీలు పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్న చందంగా తయారయ్యాయి. గ్రామాలకు దూరంగా నివాస యోగ్యంకాని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో అక్కడ ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో భూమి కొనుగోలు, మెరక, మౌలిక సదుపాయాల కల్పన పేరుతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. పనిలో పనిగా వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారు. ఇప్పుడు ఈ కాలనీల్లో దొంగలు పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని తీగను చోరీ చేస్తున్నారు. నిర్మాణదారులకు నీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులను సైతం ఎత్తుకెళ్తున్నారు. కొండపిలోని జగనన్న కాలనీని పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. నియోజకవర్గ కేంద్రమైన కొండపిలోని లబ్ధిదారులకు స్థానిక పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం-ఇలవర (నేతివారిపాలెం) గ్రామాల మధ్య భూమి కొనుగోలు చేసి జగనన్న కాలనీకి ప్రభుత్వం కేటాయించింది. అది కొండపికి దాదాపు 5 కి.మీ దూరంలో ఉంది. దాదాపు 260 మంది పేదలకు ఈ కాలనీలో పట్టాలు ఇచ్చారు. అయితే ఏదో ఒకటి పట్టా ఇస్తున్నారని పేదలు తీసుకున్నారు. కానీ కాలనీలో ఒక్క ఇల్లు మాత్రమే నిర్మాణం పూర్తయింది. దాదాపు 20 గృహాలు వివిధ స్థాయిల్లో నిలిచిపోయాయి. మిగిలిన వారు అసలు నిర్మాణాలే ప్రారంభించలేదు. ఇళ్ల మెటీరియల్‌ను దొంగలు చోరీ చేయడంతో గృహాలు నిర్మించుకోవాలనుకున్న ఒకరిద్దరు లబ్ధిదారులు కూడా వెనక్కి తగ్గారు. భూమి కొనుగోలుకు లక్షల రూపాయలు ప్రభుత్వం వెచ్చించింది. ఇవికాక మెరకలు తోలడానికి, పదేపదే ఈ కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పేరుతో వైసీపీ నాయకులు లక్షల రూపాయలు దోచుకున్నారు. నాయకుల స్వార్థం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.

ట్రాన్స్‌ఫార్మర్‌లలో తీగ చోరీ

కాలనీలో ఇళ్లు లేకుండానే విద్యుత్ సౌకర్యానికి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసింది. స్తంభాలు, తీగలు, 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఐదింటిని విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసింది. అయితే కాలనీ ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉంటుండటంతో దొంగలు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన తీగను చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లను కింద చెట్లలో పడేశారు. కొన్ని ఇళ్లకు కలిపి అక్కడే సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేసి వీటిపై 10 వేల లీటర్ల నీటి ట్యాంకులు ఉంచారు. నిర్మాణదారులకు నీటి వసతి లేకపోవడంతో వీటిని ఏర్పాటు చేశారు. వాటిలో కొన్నింటిని దొంగలు మాయం చేశారు. మరికొన్ని వృథాగా పడి ఉన్నాయి. మొత్తంగా జగనన్న కాలనీ పేరుతో లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని పలువురు విమర్శిస్తున్నారు. అనువైన భూమిలో పట్టాలు ఇవ్వక పోవడవ వల్లనే ఇదంతా జరిగిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఫ్రీహోల్డ్, అక్రమ వెంచర్ల పరిశీలన



మాచవరం వద్ద ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న జేసీ, రిజిస్ట్రార్

కనిగిరి, ఆగస్టు 16: ఫ్రీహోల్డ్ మార్పుల్లో అక్రమమని తేలితే ఆయా అధికారులపై చర్యలు తప్పవని జేసీ గోపాలకృష్ణ హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల రీసర్వేపై శుక్రవారం రెవెన్యూ అధికారుల, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఏమాత్రం ఆమోదయోగ్యంకాని భూ ములను ఫ్రీహోల్డ్ భూములుగా మార్చి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోనే కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా అక్రమంగా వెంచర్లు వేసినట్టు చెప్పారు. ఇటీవల ఫ్రీహోల్డ్ భూములుగా ఆయా భూములను మార్చిన విషయంపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిజాలు నిగ్గు తేల్చాలని అధికారులను జేసీ ఆదేశించారు. కనిగిరి మండలంలోని 40 రెవెన్యూ గ్రామాల్లో 13 బృందాలుగా ఏర్పాటుచేసి ఫ్రీహోల్డ్‌కు సంబంధించిన భూముల దస్త్రాలను పరిశీలించనున్నట్లు జేసీ తెలిపారు. ఒక్కో బృందంలో డీటీ, ఆర్‌ఐ, వీఆర్‌ఓ, సర్వేయర్ ఉంటారన్నారు. వీరు క్షేత్రస్థాయిలో బూములను పరిశీలించి 22ఏ, బీ, సీ, డీ, అసైన్డ్‌ల్యాండ్, ఫ్రీహోల్డ్, చుక్కల భూములను పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఫ్రీహోల్డ్ మార్పుచేసే క్రమంలో నిబంధనలను ఏమేరకు పరిగణనలోకి తీసుకున్నారో భూమి సర్వే నెంబరు వివరాల్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ రికార్డు గదిని పరిశీలించారు. ఆతర్వాత యడవల్లి పరిధిలోని 309/1 భూమిని, మాచవరం, శంఖవరం ప్రాంతాల్లో ఫ్రీహోల్డ్ కింద మార్పులు చేసిన భూముల రికార్డులను పరిశీలించి సర్వే చేపట్టారు. ఫ్రీహోల్డ్ భూములుగా మారిన భూములకు రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.


మంత్రి రవికుమార్‌కు గోశాల సమస్యలను వివరిస్తున్న నిర్వాహకుడు సుబ్బారావు

గోశాలకు ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు కృషి

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఆగస్టు 16: గోశాలలో పశుగ్రాసం కొరత, స్థలం సమస్యలపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితం అయిన కథనం చదివాను. గోశాలకు అవసరం అయిన స్థలాన్ని కేటాయింపు చేయిస్తానని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకిలోని హరిహర గోకులం సమస్యలను నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోగా అన్ని విషయాలు ఆంధ్రజ్యోతిలో చదివాను అని తెలిపారు. వెంటనే తహసీల్దార్ శ్రీచరణ్‌కు మంత్రి రవికుమార్ ఫోన్ చేసి గోకులానికి అవసరం అయిన స్థలాన్ని వెంటనే కేటాయించాలన్నారు.

మంత్రికి పుస్తకాలు అందజేత

పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన అద్దంకి కథలు, ప్రతిభామూర్తి ప్రకాశం పంతులు పుస్తకాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. పలువురు సాహితీ సంస్థల ప్రతినిధులు మంత్రిని సన్మానించారు.

పింఛన్ మంజూరు చేయిస్తా


పింఛన్ మంజూరు చేయించమని వేడుకుంటున్న దివ్యాంగుడు

మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన దివ్యాంగుడు వీరాంజనేయులు తనకు పింఛన్ నిలిచిపోయిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన రవికుమార్ పింఛన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులను పిలిచి పింఛన్‌కు దరఖాస్తు చేయించాలని సూచించారు. తన సొంత నగదును ఇద్దరు దివ్యాంగులకు అందజేశారు.

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం అక్కడకు వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. అత్యధిక శాతం అర్జీలను అక్కడకు వచ్చిన అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. మిగిలిన అర్జీలను ఆయాశాఖలకు పంపించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.


శిక్షణలో పాల్గొన్న ప్రతినిధులు

సురక్షిత నీటితో సంపూర్ణ ఆరోగ్యం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 16 : సురక్షిత మంచినీరు సేవించడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జల జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్లు తేజ్ సంగీత్, రంగారావు పేర్కొన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెంలో ఏపీ ప్రభుత్వంచే జలజీవన్ మిషన్‌పై జేజేఎం, డీపీఎంయూ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతున్న ఈ శిబిరంలో జిల్లా ప్రతినిధులు పాల్గొని అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి 55 లీటర్లు సురక్షిత మంచినీటిని కుళాయిల ద్వారా అందించడమే జలజీవన్ లక్ష్యమన్నారు. వీటిపై నైపుణ్యాలను పెంచుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. రోగ నియంత్రణకు శిక్షణలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి నూకతోటి రవిచంద్ర, ట్రైనర్ రాజు, నల్‌జల్ మిత్రలు, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.



శీతల గిడ్డంగుల్లో నిల్ల ఉంచిన శనగల బస్తాలు

పెరిగిన శనగల ధర

● రూ.7,400 పలికిన జేజే 11 రకం
● కాక్-2 రకం రూ.10వేల పైనే..
● నిల్వ ఉంచిన రైతుల్లో ఆనందం

ఇంకొల్లు, ఆగస్టు 16 : శనగల ధరల్లో కదలిక వచ్చింది. రోజు రోజుకూ ధర పెరుగుతోంది. ఈ ఏడాది రైతులకు పంట చేతి కందిన సమయంలో జెజె 11 రకం క్వింటా నాణ్యతను బట్టి రూ.5,800 నుంచి రూ.6,000 ధర ఉండగా జూలై మొదటి వారంలో రూ.7,000 మార్కెట్ పెరిగింది. గత మూడు నాలుగు రోజులుగా కదలిక ప్రారంభమై ప్రస్తుతం శుక్రవారం క్వింటా రూ.7,400 పలికింది. ఈ ఏడాది జేజే 11 రకం దిగుబడి తక్కువగా ఉండటంతో నిల్వలు కూడా తగ్గాయి .దీంతో గిరాకీ వచ్చిందని, కాక్2 రకం శనగలు కూడా మూడు నెలల క్రితానికి ప్రస్తుతానికి రూ.3,000 పెరిగి క్వింటా రూ.10వేల నుంచి 10,300 వరకు పలుకుతున్నాయని వ్యాపార వర్గాలు తెలిపాయి. ఒక వైపు పండుగ సీజను, ప్రభుత్వ రాయితీ విత్తనాలు కొనుగోలు చేసే సమయం కావడం వల్ల శనగల ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు

సృజనాత్మకతను వెలికి తీసేందుకే క్విజ్ పోటీలు

● రొటేరియన్ ఉదయభాస్కర్

పర్చూరు, ఆగస్టు 16: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని రొటేరియన్ పాబోలు ఉదయ భాస్కర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ భవనంలో పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాల పరిధిలో పాఠశాల స్థాయిలోని విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం ప్రోత్సాహక నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. మొదటి బహుమతి సాధించిన శారదా హైస్కూల్ విద్యార్థులకు రూ.2,516 నగదు, ద్వితీయ బహుమతి పొందిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు రూ.2116, మూడవ బహుమతి పొందిన శ్రీ శాతవాహన విద్యార్థులకు రూ.1,516 చొప్పున అందజేశారు. ఈకార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, పంబి సదానందరెడ్డి, మున్నంగి వెంకటసుబ్బయ్య, తేళ్ళ రమేష్ చంద్ర, నాగభైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, భవనం రాజగోపాలరెడ్డి, కొల్లా సుబ్బారావు, కాసా అశోక్ కుమార్ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల కడుపునింపుతున్న అన్నక్యాంటీన్

వెల్లివిరుస్తున్న ఆనందం
ప్రజల్లో హర్షాతిరేకం

అద్దంకి, ఆగస్టు 16: అన్న క్యాంటీన్ ప్రారంభంతో పేదలలో ఆనందం వెల్లువిరుస్తోంది. 5 రూపాయలకే టిఫిన్, భోజనం అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకిలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లో శుక్రవారం భోజనం చేసిన ప్రజల మనోగతాలు ఇలా ఉన్నాయి.



భోజనం చాలా బాగుంది

-ఎం. చిన్న నాగిరెడ్డి, రైతు, శంఖవరప్పాడు, అద్దంకి మండలం.

అన్న క్యాంటీన్‌లో పెట్టిన భోజనం చాలా బాగుంది. మోటార్ సైకిల్ రిపేర్ కోసం వచ్చి అన్న క్యాంటీన్‌లో భోజనం చేశాను.

రిక్షా తొక్కిన డబ్బులలో వంద అన్నంకే ఖర్చు

-మేదర రామకోటయ్య, రిక్షా కార్మికుడు, సూరేపల్లి, బల్లికురవ మండలం



రోజూ సూరేపల్లి నుంచి అద్దంకి వచ్చి రిక్షా తొక్కి నాలుగు వందల రూపాయలు సంపాదిస్తుంటాం. అందులో 100 రూపాయలు మ ధ్యాహ్నం భోజనానికి ఖర్చు అయ్యేది. అన్న క్యాంటన్ ప్రారంభించడంతో 5 రూపాయలకే పుష్టిగా తిన్నాను. కూరలు చాలా రుచిగా ఉన్నాయి.

ఎద్దులు కొనుగోలు కోసం అద్దంకి వచ్చాను

-ఆర్. కోటేశ్వరరావు, కొణిజేడు, టంగుటూరు మండలం



ఎద్దుల కొనుగోలు కోసం అద్దంకి వచ్చాను. మధ్యాహ్నం అన్నం తినే సమయంలో అన్న క్యాంటీన్‌కు వచ్చి భోజనం చేశాను. బయట హోటల్‌కు వెళితే 100 రూపాయలు ఖర్చు అయ్యేది. అన్న క్యాంటీన్‌లో 5 రూపాయలకే కడుపునిండా తిన్నాను.


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు

ఆకలితోనే ఇంటికి వెళ్ళా..

-గాదం వెంకమ్మ, యాచకురాలు, వినుకొండ.



అద్దంకిలో భిక్షాటన కోసం వచ్చిన సమయంలో 100 రూపాయలతో హోటల్‌లో తినలేక ఆకలితోనే పలుమార్లు ఇంటికి వెళ్ళాను. అన్న క్యాంటీన్ ఏర్పాటుతో 5 రూపాయలకే భోజనం పెట్టడంతో తృప్తిగా తిన్నాను.


అన్న క్యాంటీన్‌కు లక్ష రూపాయల చెక్కును విరాళంగా మంత్రి రవికుమార్ ద్వారా అందజేస్తున్న టీడీపీ నేత కోనేటి అనిల్

అన్న క్యాంటీన్‌కు విరాళాలు

అద్దంకి, ఆగస్టు 16: అద్దంకిలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి రవికుమార్ ప్రారంభించగా అక్కడకు వచ్చిన వారు తమవంతుగా విరాళాలను అందజేశారు. అద్దంకి పట్టణంలోని దామావారిపాలెంకు చెందిన టీడీపీ నేత కోనేటి అనిల్ లక్ష రూపాయల విరాళం చెక్కును మంత్రి రవికుమార్ ద్వారా అందజేశారు. అద్దంకి మండలంలోని వెంకటాపురంకు చెందిన కాంట్రాక్టర్‌లు దాట్ల రాజా, రత్నాకర్ సోదరులు లక్ష రూపాయల చెక్కును రవికుమార్ ద్వారా అందజేశారు. అద్దంకి మండలం చిన్నకొత్తపల్లికి చెందిన జొన్నలగడ్డ నాగేశ్వరరావు 100 మందికి అన్న క్యాంటీన్‌లో టోకెన్‌లు కొనుగోలు చేసి పంపిణీ చేశారు.

ప్రతిష్టాత్మకంగా క్యాంటీన్ల నిర్వహణ

తొలిరోజు రూ.5.28 లక్షలు విరాళం అందించిన దాతలు

చీరాల, ఆగస్టు 16 : 'అన్నా క్యాంటీన్ నిర్వహణకు విరాళాలు సేకరిద్దాం. అందుకు తొలి అడుగువేశాం. మంచి స్పందన వచ్చింది. రూ. కోటి లక్ష్యంగా విరాళాలు సేకరించి ట్రస్టుకు అందజేస్తామని' ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. స్థానిక హైస్కూల్ రోడ్డులో శుక్రవారం అన్న క్యాంటీన్ ప్రారంభించిన తరువాత క్యాంటీన్ ప్రాంగణంలో ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజవకర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌లు మొక్కను నాటారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఎంతటి సుదీర్ఘ ప్రయాణమైనా తొలి అడుగుతో ప్రారంభం అవుతుందన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అందుకు భావసారూప్యం కలిగిన ప్రతి ఒక్కరు ఇతోధికంగా విరాళాలు ఇచ్చి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అందుకు ముందస్తుగా తన వంతుగా రూ.54,000 ప్రకటించారు. ఈ క్రమంలో గజవల్లి శ్రీనివాసరావు రూ. లక్ష, బోయినవారిపాలెంకు చెందిన చప్పిడి పోలయ్య రూ. లక్ష, భారత్ ఇండస్ట్రీస్ నిర్వహకులు రూ.1,01,116లు, అభిరుచి రెస్టారెంట్ నిర్వహకులు రూ.51,116లు, కౌన్సిలర్లు పి. సుబ్బయ్య రూ.25వేలు, ఎస్. లక్ష్మి రూ.25వేలు, ఎంఆర్ఎఫ్ రమేష్ రూ.25వేలు, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి రూ.10వేలు, గ్రంధి ఆదిత్య రూ.10,116లు, బీజేపీ చంద్ర రూ.5వేలు, కౌన్సిలర్లు అప్పల అరుణరెడ్డి రూ.5,116లు, సత్యానందం రూ.5వేలు, యానాదిరావు రూ.5వేలు, రమణమ్మ రూ. వెయ్యి, జి. మనోహర్ రూ.500లు విరాళంగా అందజేశారు. మొత్తంగా తొలిరోజే దాతలు రూ. 5.28 లక్షలు అందించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ అన్న క్యాంటీన్ పునఃప్రారంభం సందర్భంగా నాటిన మొక్కను కూడా సంరక్షించాలన్నారు. ఆ మొక్క పెరిగి పెద్దయి ఫలాలు, నీడను అందించేప్పుడు భవిష్యత్ తరం వారికి స్ఫూర్తిదాయకం అవుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్ ప్రాంగణంలో మొక్కను నాటుతున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, డాక్టర్ మహేంద్రనాథ్

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతపూజలు


రామలింగేశ్వరుని ఆలయ సన్నిధిలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు (పంగులూరు)

బల్లికురవ. ఆగస్టు 16 : శ్రావణ మాసంలో శుక్రవారం వచ్చే వరలక్ష్మీ వ్రత పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే మహిళలు ఎంతో ఇష్టంగా లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పొంగళ్లు పెట్టుకొని ముత్తాయిదువులను పిలిచి వారికి తాంబులాలను అందజేశారు. గ్రామాలలో వరలక్ష్మీ పూజల ప్రభావంతో పూలకు ,కాయలకు మరింత డిమాండ్ పెరిగింది.

పంగులూరులో

పంగులూరు : మండలంలో గ్రామ గ్రామానా శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాలకు చేరుకున్న మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకూరు కొండపైన వేంచేసిఉన్న బాల త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి సన్నిధిలో మహిళలు వరలక్ష్మీవ్రతం సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు

అద్దంకిటౌన్ : శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ, శ్రీ ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కన్యక పరమేశ్వరి అమ్మవారిని కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించారు. ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

యద్దనపూడిలో..

యద్దనపూడి, (మార్టూరు) : శ్రావణ శుక్రవారం సందర్భంగా యద్దనపూడి, మార్టూరు మండలాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఇళ్లలో లక్ష్మీదేవి చిత్రపటాన్ని మహిళలు పూలతో అందంగా అలంకరించారు. వివిధ రకాలైన ప్రసాదాలను తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రధానపూజారి దీవి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.


గన్నవరం దేవాలయంలో విశేష అలంకరణలో లక్ష్మీదేవి (మార్టూరు)


ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో వరలక్ష్మి అమ్మవారు (అద్దంకిటౌన్)

భక్తులతో కిక్కిరిసిన అమ్మవారి ఆలయాలు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రత వేడుకలను మహిళా భక్తులు మండలంలో ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఇంటి వద్దనే వరలక్ష్మీ అమ్మవారి వ్రత కార్యక్రమం ఆచరించి భక్తిని చాటుకున్నారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకోవటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

దేశభక్తిని చాటిన చిరువ్యాపారి

పంగులూరు, ఆగస్టు 16 :స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర పటాలను పాఠశాలకు బహూకరించి దేశభక్తిని చాటాడు ఓ చిరువ్యాపారి. మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన పచ్చిపులుసు వెంకట నాగేశ్వరరావు నూజెళ్ళపల్లి గ్రామంలో దశాబ్దకాలంగా చిరువ్యాపారం సాగించారు. గ్రామంపై అభిమానంతో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలకు మూడున్నర వేలు విలువ చేసే పదిమంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర పటాలను బహూకరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాలబాలికలకు ప్రత్యేక భోజన సదుపాయం కల్పించారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామిగా ఉంటూ సహకారం అందిస్తున్న నాగేశ్వరరావుకు హెచ్ఎం వీరాంజనేయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

కమిషనర్‌పై ఆరోపణలు

చీరాల, ఆగస్టు 16 : స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి తమను అవమానపరిచారని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కమిషనర్ పంపిన సర్క్యులర్‌లోని టైమ్‌కు ముందుగా ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే కొండయ్యతో జెండా ఎగురవేయించారని, అలానే విద్యుత్ దీపాల మరమ్మతులకు వినియోగించే వాహనాన్ని కూడా నిర్ణీత సమయానికన్నా ముందుగా ప్రారంభింపజేశారని వాపోయారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌వోకు ఫిర్యాదు అందజేశామన్నారు.

రేణంగివరం ఎస్ఐగా వినోద్‌బాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

పంగులూరు, ఆగస్టు 16 : రేణంగివరం ఎస్ఐగా బి.వినోద్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తూ పంగులూరు మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినోద్‌బాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషిచేస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రేపు ముప్పవరంలో ఉచిత కంటివైద్య శిబిరం

మండలంలోని ముప్పవరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ ప్రతినిధులు చిలుకూరి వీరరాఘవయ్య, గరిమిడి జగన్మోహన్‌లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు, శంకర్ కంటివైద్యశాల పెదకాకాని వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

తెలంగాణ ఆర్టీసీ బస్సు బోల్తా

● తిరుపతి నుంచి బీహెచ్ఈఎల్‌కు వెళ్తుండగా ఘటన
● బస్సులో మొత్తం 26 మంది ప్రయాణికులు
● గాయపడిన వారిని ఒంగోలు రిమ్స్‌కు తరలింపు


బోల్తా పడిన తెలంగాణ ఆర్టీసీ బస్సు

అద్దంకిటౌన్, ఆగస్టు 16: టీఎస్ఆర్టీసీ ఏసీ బస్సు బోల్తా పడింది.శుక్రవారం అర్ధ రాత్రి జరిగిన ఈ ఘటనలో ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ బీహెచ్ఈఎల్ డిపోకు చెందిన టీఎస్09 జెడ్7880 నెంబరు గల ఏసీ బస్సు తిరుపతి నుంచి బీహెచ్‌సీఎల్ వెళ్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి 2.30 గంటల సమయంలో అద్దంకి - మేదర మెట్ల రోడ్డులోని ధేనువకొండ ఘనరావా సకాలనీ వద్దకు వచ్చే సరికి రోడ్డు మరమ్మతులు చేస్తూ మధ్యలో పెట్టిన ప్లాస్టిక్ దిమ్మెలను ఢీ కొట్టి అదుపు తప్పి బోల్తా పడింది. బస్సులో మొత్తం 26 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, ఒక సహాయకుడు ఉన్నారు. బస్సు వేగం తక్కువగా ఉండడంతో బస్సు ఒక పక్కకు బోల్తా పడగా ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడడ్డారు. ప్రమాదం జరిగిన కొంత సమయంలోనే ప్రయాణికులు అందరు తేరుకుని బయటకు వచ్చారు. వారిలో కొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించారు. అనంతరం తెల్లవారుజామున బోల్తా పడిన బస్సును క్రేన్‌ల సహాయంతో లేపి పక్కకు పెట్టి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


సింథైట్ ఫ్యాక్టరీలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

మేదరమెట్ల, ఆగస్టు 16: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడాలని కొరిశపాడు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సింథైట్ ఫ్యాక్టరీ ఆవరణంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఫ్యాక్టరీ ఆవరణంలో, గ్రామంలో మొక్కలు నాటుతున్నామని జీఎం మహేంద్ర తెలిపారు. మొక్కలు నాటడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని డిప్యూటి తహసీల్దార్ మెహతాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పోతురాజు, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి, అధికారులు సలాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 16 : మండలంలోని పందిళ్లపల్లి పరిధిలో శుక్రవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. తదుపరి చర్యలకు రెవెన్యూకు అప్పగించనున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు ఎవరు పాల్పడ్డా ఉపేక్షించేది లేదన్నారు.

నేటితరం నాయకులకు మార్గదర్శకులు వాజ్‌పేయి


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చీరాల, ఆగస్టు 16 : దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి నేటి తరం నాయకులకు మార్గదర్శకులని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేడికొండ భరణీరావు, శంకరశెట్టి నాగేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, తడవర్తి చంద్రశేఖర్, మనోహర్‌రెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన చైర్‌పర్సన్


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఆగస్టు 16: అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్‌లు దేసు పద్మేష్, అనంతలక్ష్మిలతో పాటు వైసీపీ కౌన్సిలర్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మంత్రి సమీక్ష రోజు అటువైపు రాని చైర్మన్, వైసీపీ కౌన్సిలర్లు శుక్రవారం అన్న క్యాంటీన్ వద్దకు వచ్చి కలవడం రాజకీయ వర్గాలల్లో చర్చనీయాంశంగా మారింది.

బాకీ చెల్లించమన్నందుకు దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

చీరాలటౌన్, ఆగస్టు 16 : ఇచ్చిన బాకీ తిరిగి చెల్లించమన్నందుకు వ్యక్తిని ఇరువురు దాడి చేశారు. ఈఘటన శుక్రవారం మధ్యాహ్నం పురపాలక పరిధిలోని విఠల్‌నగర్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బోడిపోగు నాని తప్పెడ పలకలు వాయిస్తూ జీవిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన అండర ఆశీర్వాదం కుటుంబం అవసరాల నిమిత్తం నాని వద్ద రూ. 10 వేలు అప్పుతీసుకున్నాడు. దీంతో రోజులు గడుస్తుండటంతో నాని నిలదీశాడు. దీంతో ఆశీర్వాదం, రవికుమార్‌లు ఆయనపై తీవ్రంగా దాడి చేశారు. ఈక్రమంలో అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

టీడీపీ సీనియర్ నాయకులు ఆంజనేయులు మృతి


ఆంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, ఆగస్టు 16 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చుండిబజారుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మాచవరపు ఆంజనేయులు(65) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటని చినగంజాం గ్రామ టీడీపీ అధ్యక్షులు చెరుకూరి రాఘవయ్య అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆంజనేయులు స్వగృహం వద్ద ఆయన పార్థివదేహానికి టీడీపీ నాయకులు రాయని ఆత్మారావు, అబ్దుల్‌కలాంఆజాద్, రాఘవయ్య, మోటుమర్రి రామసుబ్బారావు, కోట శివరామకృష్ణ, షేక్ జిలాని, మాచవరపు రామాంజనేయులు, పర్వతరెడ్డి పార్థసారధి, ఎం.లక్ష్మయ్య, షేక్ బాజీ, వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆంజనేయులుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సర్ధార్ గౌతు లచ్చన్న జయంతి

చీరాల, ఆగస్టు 16 : సర్ధార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ తదితరులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. న్యాయవాది మస్తాన్‌రావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.